# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

సంపుటి: 43 సంచిక: 17 విజయవాడ 5-1-2011 పేజీలు: 8 వెల: రు 5.00

www.janashaktionline.com



లోపలి పేజీల్లో...

- మరింత దూకుడు దిశగా 'నాటో' సమావేశం
- ప్రపంచ వ్యాపిత ప్రజల నిరసనాందోళనలు
- ప్రభుత్వ పొదుపు చర్యలకు వ్యతిరేకంగా యూరప్‌లో కార్మికుల నిరసనలు
- దళితులపై కొనసాగుతున్న ఫ్యూడల్ దాడులు-దౌర్జన్యాలు
- ప్రజాస్వామిక విలువలపై దాడిచేస్తున్న హిందూ దురహంకారులు


## ఎందుకూ కొరగాని ప్రభుత్వ సహాయం-పెరుగుతున్న ఆత్మహత్యలు

**చీడపీడలు** అనావృష్టి, వరదల వలన పంట నష్టపోయి, మిగిలిన పంటకు కూడా సరైన ధర లభించక, పంట ఖర్చులు కూడా రాక అప్పుల పాలౌతున్న రైతాంగం అవి తీర్చే మార్గం కానరాక ఆత్మహత్యలే శరణ్యమన్న మానసిక స్థితికి గురౌతున్నారు. అందుకు పాల్పడుతున్నారు. ఈ సంవత్సరం జరిగిన పంట నష్టం ఆత్మహత్యల పరంపరను ముమ్మరం చేసింది.

సెప్టెంబర్ నుండి నవంబర్ వరకు భారీ వర్షాలు, లైలా, జల్ తుఫాన్‌లకు నష్టంతోపాటు డిసెంబరు 5 నుండి 9 వరకు కురిసిన వర్షానికి 30 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగి 2158.65 కోట్ల రూపాయలు రైతాంగం నష్టపోయారు. నూర్పిడి చేసి ధాన్యం ఇంటికి చేర్చేందుకు సిద్ధమౌతున్న సమయంలో వర్షపు నీటిలో తేలియాడిన ఓదెలు, మట్టిని కరుచుకుపోయిన. వరిపైరు, తడిసి ముద్దై క్రింద పడిన పత్తి తదితర పంట నష్టాలతో రైతులు విలపిస్తున్నారు. నీటిలో, మట్టిలో నానిన కంకుల నుండి వచ్చిన మొలకలు రైతాంగం గుండెలను పిండి వేస్తున్నాయి. ఇంతటి భారీ నష్టానికి ఇటీవల కాలంలో రైతాంగం గురికాలేదు. ఈ నష్టం నుండి రైతాంగం త్వరగా కోలుకునే పరిస్థితి కన్పించటంలేదు.

### ప్రభుత్వ ప్యాకేజి

ఇంతటి నష్టానికి ప్రకృతి వైపరీత్యంతోపాటు, పాలక ప్రభుత్వానికి బాధ్యత ఉంది. ఆ బాధ్యతను విస్మరిస్తున్న ప్రభుత్వం, నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకొనే చర్యలు చేపట్టటంలోనూ విఫలమైంది. రైతాంగాన్ని అన్ని విధాలా ఆదు కొంటామని చెప్పే మాటలు, గడపలుదాటి ముందుకు సాగటం లేదు. రైతాంగం జీవన్మరణ సమస్యతో కొట్టుమిట్టాతూ ఉండగా, వారి సహాయార్థం ప్రకటించిన ప్యాకేజీ, రైతుల జీవితాలతో పరిహాసమాడింది. వరికి రు. 32వేలు, పత్తికి రు. 38వేలు, వేరుశనగకు రు. 32వేలు, సాగుకు ఖర్చుపెట్టిన రైతులకు ఎకరానికి రు. 24 వందలు పరిహారంగా ప్రకటించి ఎంతో ఉదారంగా సహాయం అందచేస్తున్నట్లు చెప్పుకోవటం ప్రభుత్వపు ఏమాత్రం సిగ్గులేనితనానికి నిదర్శనం. ముప్పై, నలభై వేలు ఖర్చుపెట్టిన రైతులకు ప్రభుత్వం ప్రకటించిన పరిహారం, తడిసిన పనలు తిరగదిప్పటానికి కూడా చాలదు. ప్రకృతి వైపరీత్యాల వలన పంట నష్టపోయిన రైతులకు పొరుగునున్న ప్రభుత్వం ఎకరాకి 10 వేలు చెల్లిస్తుండగా మనదే అత్యుత్తమ ప్యాకేజీ అని రాష్ట్ర పాలకులు ప్రకటించటానికి మించిన ఆత్మవంచన వుంటుందా?!

కాగా కౌలు రైతాంగానికి ఈ మేరకు సహాయం కూడా వర్తించదు. కౌలు పత్రాలు గాని, ప్రభుత్వ గుర్తింపు గాని వారికి లేకపోవటమే అందుకు కారణం. చాలా మంది భూయజమానులు కౌలు రైతుల పేర్ల నమోదుకు అంగీకరించటంలేదు. భూయజమానుల అభ్యంతరాలతో కౌలు రైతులకు ఈమేరకైనా సహాయం ఏవిధంగా అందించేదీ ప్రభుత్వ ప్యాకేజీలో ప్రకటించలేదు.

ఈ సంవత్సరం బ్యాంక్ తీసుకొన్న పంట రుణాల వడ్డీ 350 కోట్లు రద్దు చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇదికూడా అరాకొరగానే ఉపయోగపడుతుంది. పంట నష్టపోయిన 20 లక్షల రైతుల్లో సగం పైగా కౌలు రైతులేవున్నారు. వారిలో 79 వేలమంది కౌలు రైతులకు మాత్రమే బ్యాంక్‌లు రుణాలు యిచ్చాయి. 2,66,634 మంది కౌలురైతులు బ్యాంక్ రుణాల కోసం పేర్లు నమోదు చేసుకున్నారు. వీరితో 56,186 'ఉమ్మడి' రుణ బాధ్యత బృందాలను ఏర్పాటు చేసి; 9,030 బృందాలలోని 79,360 మంది కౌలు రైతులకు 139 కోట్లు మాత్రమే రుణాలు యిచ్చారు. అందువలన వడ్డీ మాఫీ పొందే కౌలు రైతులు చాలా తక్కువ. సొంత భూమి కలిగిన రైతులు కూడా, రుణాల వాయిదా ఫలితంగా ఒక సంవత్సరం వాయిదా తర్వాత మూడు సంవత్సరాల్లో వాయిదాల పద్ధతిలో రైతులు బ్యాంక్ అప్పులు తీర్చాలి. ఇందుకు పావలా వడ్డీ వర్తించదు. రూపాయి వడ్డీని వసూలు చేస్తారు. ఫలితంగా వడ్డీ భారం పెరిగి, రద్దు చేసిన వడ్డీకన్నా ఎక్కువ వడ్డీని రైతులు చెల్లించాల్సి వస్తుంది. ఇది రైతాంగాన్ని దోపిడీ చేయటమే.

పంటనష్టపోయిన రైతులకు బీమా సౌకర్యం వర్తింపచేసి పరిహారం అందచేస్తామని ముఖ్యమంత్రి చెబుతున్నారు. దీన్ని గ్రామం యూనిట్‌గా తీసుకొంటామంటున్నారు. పంటలు కోయటానికి ముందు ఆ ప్రాంతంలో పంట సర్వే జరిపి ఎంతశాతం దిగుబడి వచ్చేది పరిశీలక బృందం ప్రకటిస్తుంది. అనేక ప్రాంతాల్లో పంట శాతం ప్రకటించిన తర్వాత ముంపుకి గురై నష్టం జరిగింది. ఇటువంటి నష్టానికి రైతులకు బీమా పరిహారం అందదు. పరిహారం వర్తించే ప్రాంతంలో 50% కన్నా దిగుబడి తక్కువగా ఉంటేనే రైతులకు బీమా పరిహారం వర్తిస్తుంది. అదీ ఒక పంటకు మాత్రమే మిగతా పంటలు నష్టపోయినా పరిహారం రాదు. ఈ పరిహారం చెల్లింపుకూడా మొత్తం పంట విలువకు కాకుండా సాగు ఖర్చులకు వర్తించటం, ఖర్చులు కూడా తక్కువ చూపటం వలన రైతులకు అందే పరిహారం నామమాత్రమే. రైతులకు అదికూడా నేరుగా అందకుండా బ్యాంక్ అప్పులకు జమ పడుతుంది. 2008లో రైతులకు రాష్ట్ర ప్రభుత్వం వాటాగా చెల్లించవలసిన ప్రీమియం మొత్తాన్ని విడుదల చేయకపోవటం వలన బీమా ఇప్పటికి రైతులకు అందలేదు. అత్యధిక మంది కౌలు రైతులు ఇందుకు కూడా అర్హులు కారు. కారణం వారి నుండి ప్రీమియం కట్టించుకోకపోవటమే.

చనిపోయిన గేదెలు, ఆవులు, దూడలకు, గొర్రెలు, మేకలకు, కోళ్ళ పరిశ్రమకు. చేనేత కార్మికులకు ప్రకటించిన పరిహారం వాటిని పునరుద్ధరించుకోవటానికి ఏమాత్రం దోహదపడదు. ముంపు, వర్షాల వలన పనులు కోల్పోయిన వ్యవసాయ కూలీలకు ఎటువంటి పరిహారం ప్రకటించలేదు.

### ధాన్యం కొనుగోలు

నష్టపోగా మిగిలిన ధాన్యం కూడా తడిసి రంగు మారటం వలన అమ్ముకోవటం రైతాంగానికి సమస్యగా మారుతున్నది. మిల్లర్లు, వ్యాపారులు దారుణంగా ధర తగ్గించి కొనుగోలు చేయటం వలన రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పుడు ఈ సమస్య రైతాంగానికి ఎక్కువగా వుంటుంది. రంగు మారిన, తడిసిన ధాన్యం మొత్తం రైతాంగం నుండి కొనుగోలు చేయటానికి బదులు, యాభైశాతం మిల్లర్ల చేత కొనుగోలు చేయిస్తానని ప్రభుత్వం ప్రకటించటం రైతులను తీవ్ర నష్టానికి గురి చేస్తుంది. కొనే ధాన్యానికి కూడా అనేక ఆంక్షలు విధించింది. పదిశాతం మేర రంగుమారిన ధాన్యానికి మాత్రమే మద్దతు ధర చెల్లిస్తామని చెప్పటం రైతుల నెత్తిన బండ వేయటమే. పదిశాతంకన్నా ఎక్కువ రంగుమారిన ధాన్యానికి ఒక్కోశాతానికి 10.30 పైసలు. మద్దతు ధరను తగ్గిస్తారు. యాభైశాతం మేర రంగుమారిందని సర్వత్రా వ్యక్తమౌతున్న అభిప్రాయం. ఇలాంటి ధాన్యం మొత్తాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయటం వలన దుఃఖంలో ఉన్న రైతాంగానికి ఒకమేర వూరట లభిస్తుంది. ప్రభుత్వం విధించిన ఆంక్షల వలన రైతులకు క్వింటాల్ ధాన్యానికి లభించేది 5 లేక 6 వందల రూపాయలు మాత్రమే. రాష్ట్ర ప్రభుత్వ దోపిడీతోపాటు, మిగతా యాభైశాతం ధాన్యాన్ని వ్యాపారులకు తెగనమ్ముకోవాలిన పరిసితి రెతులకు ఏర్పడింది.

(తరువాయి 2వ పేజీలో)

సంపాదకీయం

## కృష్ణా ట్రిబ్యునల్ తీర్పు

**కృష్ణానదీ** జలాల వివాద పరిష్కారానికి నియమించిన బ్రజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తన తీర్పును వెలువరించింది. కేంద్ర జల మండలి కొలమానాలనుంచి నీటిపారుదల లభ్యత సేకరిస్తున్న 47 సంవత్సరాల లెక్కలు ప్రాతిపదికగా తీసుకుని కృష్ణాలో నీటి లభ్యతను గణించింది. దీనిలో 65 శాతాన్ని లభ్యతగా నిర్ణయించి నికర జలాలను 2578 టియంసిలుగా నిర్ధారించింది. బచావత్ ట్రిబ్యునల్ 75 శాతం లభ్యతగా నిర్ణయించిన 2130 టి.ఎం.సి.లు పోనూ అదనంగా వున్న నికర జలాలనూ ఆంధ్రకు 39 టి.ఎం.సి.లు, కర్ణాటకకు 69 టి.ఎం.సి.లు మహారాష్ట్రకు 43 టి.ఎం.సి.లు కేటాయించింది. నికర జలాలు పోగా మిగులు నీటినికూడా ఆంధ్రాకు 145 టి.ఎం.సి.లు, కర్ణాటకకు 105 టి.ఎం.సి.లు, మహారాష్ట్రకు 35 టి.ఎం.సి.లు కేటాయించింది. పునర్వినియోగ జలాలతో కలిపి మొత్తంగా ఆంధ్రాకు 1001 టి.ఎం.సి.లు, కర్ణాటకకు 911 టి.ఎం.సి.లు మహారాష్ట్రకు 666 టి.ఎం.సి.లు కేటాయించింది. ఈ కేటాయింపుల నుండే మద్రాసుకు 35 టి.ఎం.సి.ల తాగునీరు మూడు రాష్ట్రలు ఇవ్వాలని చెప్పింది. కర్ణాటక కోరిన విధంగా అలమట్టి ఎత్తును పెంచుకునేందుకు అనుమతించింది. తీర్పు అమలును ఖచ్చితంగా అమలు జరిపేందుకు కేంద్ర అదనపు కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, మూడు రాష్ట్రాల ఛీఫ్ ఇంజనీర్లతో కృష్ణా నీటి నిర్ణయ అమలు బోర్డును మూడునెలలలోగా ఏర్పరచాలని ఆదేశించింది. కృష్ణానదిపై వున్న ప్రాజెక్టులన్నీ బోర్డు పరిధిలోకి వస్తాయి. తీర్పుపై అభ్యంతరాలు తెలుపుకునే అవకాశం మూడురాష్ట్రాలకూ వుంది. వాటిని పరిశీలించి కొద్దిపాటి సర్దుబాట్లను ట్రిబ్యునల్ చేయవచ్చునేమోగానీ, మౌలికంగా మార్పుండబోదు. తీర్పు 2050 వరకూ అమలులో వుంటుంది.

ఈ తీర్పుపై మూడు రాష్ట్రాల్లోనూ సంతృప్తి, అసంతృప్తి కూడా సహజంగానే వ్యక్తమయ్యాయి. బచావత్ ట్రిబ్యునల్ ఆంధ్రప్రదేశ్‌కు హక్కుగాయిచ్చిన మిగులు జలాలను పంచటంపై ఆంధ్రప్రదేశ్‌లో ఆందోళన వ్యక్తమౌతుండగా, ఆంధ్ర ప్రదేశ్‌కు కేటాయించిన నీటిని కూడా ప్రాంతాల వారిగా పంపకం చేసి వుండాల్సిందన్న వాదన వచ్చింది. కొయినా డ్యాములో విద్యుదుత్పత్తికి అదనంగా 25టి.ఎం.సి.లు కేటాయించినందుకు సంతృప్తి పడుతూ, అలమట్టి ఎత్తు పెంచినందువల్ల ఏర్పడే ముంపు సమస్యపట్ల మహారాష్ట్ర ఆందోళన వ్యక్తం చేసింది. కేటాయింపు పెరిగినందుకు సంతృప్తి వెలిబుచ్చిన కర్ణాటక తుంగభద్ర భీమా తదితర ఉపపరీవాహక ప్రాంతాల్లో నీటి వినియోగంపై విధించిన పరిమితులపట్ల తన అసంతృప్తిని వెళ్లబుచ్చింది.

నీటి లభ్యత, వాటి పంపకం మీదే ట్రిబ్యునల్ కేంద్రీకరించటంతో కేటాయింపుల్లో ఎక్కువ, తక్కువలను బట్టి ఇలా భిన్న అభిప్రాయాలు వ్యక్తమౌతున్నాయి. నదీజలాల వివాదానికి మూలకారణాన్ని పరిష్కరించే దిశగా ట్రిబ్యునల్ పూనుకోలేదు. అలా పూనుకోకుండా నిరోధించింది ట్రిబ్యునల్‌కు నిర్దేశించిన పరిశీలనాంశాలలో ఇదిలేకుండా చేయటమే. భారత దోపిడీ పాలక వర్గాలు నదీజలాల వివాదాలు రావణాకాష్టంలా రగులుతూనే ఉండాలని కోరుకున్నందునే ఇలా జరిగింది.

ప్రతి నాలుగుఏళ్ళలో సగటున ఒక ఏడాది అనావృష్టి ఏర్పడుతుందన్నది అందరకూ తెలిసిన అంశమే. అప్పుడే నీటికొరత ఏర్పడి ఇబ్బందులేర్పడతాయి. పరివాహక ప్రాంతాలలోని రాష్ట్రాలు పరస్పర నిందారోపణలతో ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టుకుంటాయి. నీటి ఎద్దడి ఏర్పడిన కాలంలో నీటి పంపకాన్ని ఎలా చేసుకోవాలన్న అంశాన్ని ట్రిబ్యునల్ పరిశీలించలేదు. ఆలమట్టి ఎత్తు పెంచినందున కొన్ని నెలల్లో క్రిందికి వదల వలసిన నీటిని మాత్రమే పేర్కొంది. నీటి ఎద్దడి ఏర్పడిన కాలంలో పై రాష్ట్రాలలోని రిజర్వాయర్లు నిండేవరకూ నీరు వదలరు గనుక దిగువ రాష్ట్రాల ఆయకట్టు నీరు లేక ఎండి పోవటమో, నాట్లు నెలల తరబడి ఆలశ్యం కావటమో జరుగుతుందన్న భయం న్యాయంగానే వ్యక్తమౌతున్నది.

అయితే దీనికి పరిష్కారం వెతికేందుకు ఎవరూ పూనుకోవటంలేదు. ప్రత్యేకించి దిగువ రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ నాయకులు. బచావచ్ ట్రిబ్యునల్ తన తీర్పులో దీనికి రెండు ప్రత్యామ్నాయాలను సూచించింది. ప్లాన్ 'ఏ' ప్రకారం పై ప్రాజెక్టులు నిండిన తర్వాత క్రిందికి వదలడం. ప్లాన్ 'బి' నదిలో నీటి చేరికను బట్టి ఆ నీటిని ఎప్పటికప్పుడు కేటాయింపుల దామాషాలో రాష్ట్రాలు పంచుకోవటం. ఎగువన ప్రాజెక్టులు లేనందున నదిలో నీరంతా ఆంధ్రప్రదేశ్‌కు చేరుతుందని (పై రాష్ట్రాలు ప్రాజెక్టులు కట్టుకుంటే పరిస్థితి ఏమౌతుందన్న దూరదృష్టి లేకుండా) వాదిస్తూ ఆనాటి ఆంధ్ర ప్రభుత్వం మొదటి పద్ధతినెంచుకుంది. 2000తో బచావత్ ఆవార్డు కాల వ్యవధి ముగియనుండటంతో మూడు దశాబ్దాలు పట్టించుకొనని మూడురాష్ట్రాల పాలకులూ హడావుడిగా ప్రాజెక్టుల నిర్మాణాలు చేపట్టారు. మిగులు నీటిని ప్రాజెక్టులకు కేటాయించుకునేందుకంటూ ఒకరినొకరు నిందించుకుంటూ, వివాదాలు రేపి నిర్మాణాలు ఆలశ్యం చేసుకున్నారు తప్ప రైతాగానికి సత్వరం నీరందిచటాన్ని ఆటంకపరిచారు. బచావత్ ఆవార్డు కేటాయించిన నీటిని వినియోగించుకునే ప్రాజ్కులుకూడా దాని కాల వ్యవధి తీరిపోయిన దశాబ్దానికి కూడా పూర్తికాలేదు; కర్ణాటకలో డ్యాముల నిర్మాణం పూర్తయిందిగానీ ప్రధాన కాలువలు పూర్తికాలేదు; పంపిణీ, పంటకాలువలెప్పటికి పూర్తవుతాయో తెలియదు. డ్యాము అవసరం లేని తెలుగుగంగ ప్రాజెక్టు ప్రధాన కాలువ పూర్తయిందిగానీ, పంట పొలాలకు నీరందించే కాలువల నిర్మాణం సాగుతూనేవుంది.

బచావత్ అవార్డు సమయంలో చేసిన తప్పునే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మళ్లీ చేసింది. నదిలో చేరిన నీటిని దామాషాలో పంచుకుందామన్న ప్రతిపాదన చెయ్యకుండా, మిగులు నీరంతా తనకే చెందాలన్న మొండి వాదన చేసింది.

(తరువాయి 2వ పేజీలో)

## ప్రకటన: తృణమూల్ కాంగ్రెస్ దాడులను ఖండించండి!

సిపిఐ(ఎం.ఎల్) మిద్నపూర్ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ నిరంజన్‌బెరా, జిల్లా కమిటీ సభ్యుడు సుబోధ్‌మండీలపై 2010 డిసెంబరు 20న శివానందపూర్ గ్రామంలో తృణమూల్ కాంగ్రెసు దాడిచేసింది. తృణమూల్ నాయకుడు స్వపన్ పత్రా ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడిలో కామ్రేడ్ సుబోధ్ తీవ్రంగా గాయపడ్డారు.

2009 పార్లమెంటు ఎన్నికల్లో 19 సీట్లు గెలిచిన తృణమూల్, సిపియం సాగిస్తున్న చెడు పాలనను సొమ్ముచేసుకుని బలం పుంజుకుంది. 1970, 1980ల దశకాల్లో సాగిన రైతాంగ ఉద్యమాలవల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఆధిపత్యాన్ని కోల్పోయిన భూస్వాములు, వడ్డీవ్యాపారులు, పెత్తందారులు కాంగ్రెసుకు సామాజిక పునాదిగా వుంటూ వచ్చారు. వీరిప్పుడు తృణమూల్‌తో చేరారు. దళిత, ఆదివాసీ కూలీలనూ, పేద రైతాంగాన్నీ లొంగదీసుకునేందుకు పూనుకున్నారు. సిపిఐ(ఎం.ఎల్) నాయకులపై దాడి దీనిలో భాగంగా జరిగింది. ఈ ప్రాంతంలో మరేయితర రాజకీయ పార్టీ కార్యకలాపాలు సాగనివ్వనని తృణమూల్ ప్రకటించింది. దాడి జరిగిన గ్రామం కులినా పంచాయితీలో వుంది. పంచాయితీకి ఎన్నికయిన సభ్యులతో తృణమూల్ బలవంతంగా రాజీనామాలు చేయించింది. పంచాయితీ సభ్యుడు శ్రీదాసహరి మండిని 2010 డిసెంబరు 20న రాజీనామా చేయమని బలవంతపెట్టింది. దాసహరి వికలాంగుడు. సిపిఐ(ఎం.ఎల్) మద్దతుతో గెలిచారు.

కొన్ని ప్రాంతాలలో భయోత్పాతంతో పట్టును నిలబెట్టుకునేందుకు సిపియం ప్రయత్నిస్తుండగా, మరికొన్ని ప్రాంతాల్లో భయోత్పాతంతో పెత్తనం పొందేందుకు తృణమూల్ పూనుకున్నది. ప్రజల ముందు రెండు ప్రత్యామ్నాయాలే వున్నాయనీ, వారు మాతో వుండాలి లేదా సిపియంతో వుండాలి, మూడవ ప్రత్యామ్నాయంలేదని తృణమూల్ ఎంపి సుభేందు అధికారి బహిరంగంగానే ప్రకటించాడు.

సిపిఐ(ఎం.ఎల్) ఈ వైఖరిని ఖండిస్తున్నది. ప్రతి ఒక్క వ్యక్తికీ తానెంచుకున్న రాజకీయ పార్టీ ననుసరించే హక్కు రక్షణకు తన శక్తికొలదీ పోరాడతానని ప్రకటిస్తున్నది.

తన ప్రాంతాల్లో ఎర్రజెండా నెగురవేయటాన్ని అనుమతించబోనని కూడా తృణమూల్ ప్రకటించింది. అరుణపతాక గౌరవాన్ని కాపాడేందుకు చివరి రక్తం బొట్టు వరకూ పోరాడుతానని సిపిఐ(ఎం.ఎల్) ప్రకటిస్తున్నది. వంచనాత్మక వామపక్ష సిపియం, కరుడుగట్టిన మితవాద తృణమూల్ కాంగ్రెసులు సాగిస్తున్న దాడులనుండి ప్రజల ప్రజాస్వామిక హక్కులను కాపాడేందుకు చేతులు కలపమని నిజమైన వామపక్ష, ప్రజాస్వామిక శక్తులకు విజ్ఞప్తి చేస్తున్నది.

**2010 డిసెంబరు, 22**

**సంతోష్ రాణా, ప్రధాన కార్యదర్శి**
**పిసిసి, సిపిఐ(ఎం.ఎల్)**

## డాక్టర్ బినాయక్ సేన్‌ను విడుదల చెయ్యాలి!

**మానవహక్కుల** ఉద్యమనేత డా॥ బినాయక్‌సేన్‌కు, రాయపూర్ సెషన్స్ కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. రాజ్యద్రోహానికీ, రాజ్యద్రోహానికి పాల్పడేందుకు కుట్ర అన్న ఆరోపణలతో పాటుగా, నిషేధించబడిన సంస్థ తరఫున పనిచేయటం, టెర్రరిస్టు సంస్థలో సభ్యత్వం కలిగి వుండటం, లేదా దానికి మద్దతునివ్వటమన్న ఆరోపణలపై ఆయనకీ శిక్షవిధించారు.

జైలులో వున్న మావోయిస్టు నాయకుడి నుండి లేఖను తీసుకుని కలకత్తాలోని వ్యాపారి పియూష్ గుప్తాకు అందజేసారన్న వాదనతో ఈ శిక్షవిధించారు. ఇలా అందజేశాడన్న ఆరోపణకు ఎలాంటి ఆధారాలు లేకపోయినప్పటికీ (జైలు అధికారులు అలాంటి లేఖ మార్పిడి జరగలేదని సాక్ష్యం చెప్పారు. ప్రాసిక్యూషన్ చూపెట్టిన లేఖ గుప్తా వద్ద దొరకినట్లు ఆధారం లేదు) ఈ శిక్ష విధించటం ద్వారా, న్యాయ సూత్రాలనేకాక, రాజ్యద్రోహ నేరంలో సుప్రింకోర్టు రూపొందించిన సూత్రాలను కూడా కాలరాశారు.

రాజ్యహింసనూ వ్యతిరేకించిన డా॥ బినాయక్‌సేన్‌కు శిక్షి విధిచటం ద్వారా దోపిడీ పాలకవర్గాల పాలననూ, విధానాలనూ వ్యతిరేకించే స్వరాల గొంతు నులిమి వేసేందుకు ఎలాంటి జంకు గొంకూ లేకుండా వ్యవహరిస్తామని పాలకులు స్పష్టం చేసారు.

న్యాయశాస్త్ర మౌలిక సూత్రాలను కాలరాచివేస్తూ డా॥ బినాయక్‌సేన్‌కు విధించిన శిక్షను **"జనశక్తి"** తీవ్రంగా ఖండిస్తున్నది. పౌర ప్రజాస్వామిక హక్కులపై పాలకులు సాగిస్తున్న దాడిలో భాగంగా పరిగణిస్తున్నది. శిక్షను రద్దుచేసి డా॥ బినాయక్‌సేన్‌ను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నది.

**విజయవాడ** **సంపాదకుడు**
**30-12-2010** **జనశక్తి**

**కృష్ణా...** **(మొదటి పేజీ తరువాయి)** ఎగువ రాష్ట్రాలకు మొదట తమ రిజర్వాయర్లు నిండుతాయన్న దృష్టితో మొదటి పథకాన్నే కోరాయి. అదనపు నీటిని నిల్వ చేసుకునే అవకాశముందా అని ట్రిబ్యునల్ అడిగినప్పుడు, అవకాశం లేదన్న వాస్తవాన్ని ఆంధ్రప్రదేశ్ చెప్పాల్సి వచ్చింది. దీనితో ఆలమట్టి ఎత్తుపెంచి అదనపు నీటి నిల్వకు ట్రిబ్యునల్ అనుమతించింది, అదనపు నీటిని విద్యుదుత్పత్తికి వాడాలనీ, కొన్ని నెలల్లో తప్పనిసరిగా దిగువకు వదలవలసిన నీటి పరిణామాన్ని నిర్దేశించింది.

ఇక మిగిలింది ఈ తీర్పు అమలు. తీర్పులోని అంశాలను తుచా తప్పకుండా అమలు జరిపేందుకు బోర్డును నియమించాలని ఆదేశించింది. కేటాయించిన నీరుకూడా సద్వినియోగమవుతున్నదా అన్నది మరొక సమస్య. పూర్తయిన మొదటి దశ నాగార్జునసాగర్ ఆయకట్టకు నీటి సరఫరా అస్తుబిస్తుగానే వుంది. నీరు వస్తుందో రాదో తెలియక రైతాంగం నానాయిబ్బందులూ పడుతున్నారు. గత ఏడాది వరదలతో రిజర్వాయర్లు నిండిపోయినా సాగరు ఆయకట్టుకు ఇబ్బందులు తప్పలేదు. కృష్ణాలో నీటి ప్రవాహం ఎగువ ప్రాజెక్టుల వల్ల తగ్గిందన్న వాదన  ఈ కారణంగానే నమ్మశక్యంగాలేదు. చౌకగా లభ్యమయ్యే జలవిద్యుత్తు కొరకు శ్రీశైలం, నాగార్జునసాగర్‌లవద్ద నీటిని ఎడాపెడావాడేసి రైతాంగాన్ని ఎండగడుతున్నారన్న అనుమానం బలపడుతున్నది. పోలవరం పూర్తిచేసి గోదావరి నీటిని కృష్ణా బ్యారేజికి మళ్లిస్తే, సాగర్ నుండి చుక్కనీరు కూడా క్రిందికి వదలవలసిన అవసరముండదు. మరాలాంటప్పుడు కృష్ణాడెల్టాను స్థిరీకరించటం పేరిట పులిచింతల కట్టడమెందుకు, విద్యుదుత్పత్తి కోసం తప్ప. ఈ కారణాల రీత్యానే రైతాంగానికి సాగునీటి సరఫరా పాలక వర్గాలకు పట్టలేదన్నది స్పష్టం. కనుక ప్రాజెక్టుల వినియోగంలో సాగునీటికి ప్రథమ ప్రాధాన్యతనిచ్చి అమలు జరిపినప్పుడే ఈ సమస్య పరిష్కారమవుతుంది. అంతవరకూ ఎన్ని ట్రిబ్యునళ్లు ఎన్ని తీర్పులిచ్చినా కృష్ణాజలాలు పొలాలలోకి  పారవు.

ట్రిబ్యునల్ నిర్ణయాన్ని అమలు జరిపేందుకూ, దామాషా పద్ధతిలో నీటి పంపకానికీ, కేటాయించిన నీటిని వ్యవసాయనికి ప్రథమ ప్రాధాన్యతనిచ్చి సద్వినియోగం చేయటానికీ స్వతంత్ర చట్ట అధికార ప్రతిపత్తిగల యంత్రాంగం ఏర్పాటు కావాలి. ట్రిబ్యునల్ సూచించిన బోర్డు ఈ పనిని చెయ్యలేదు. మూడు రాష్ట్రాలూ, కేంద్రమూ కూడా దీనికి సిద్ధంగాలేవు. తీర్పు లేదా ఒప్పందాలను అమలు జరిపే పటిష్టమైన యంత్రాంగం ఏర్పాటుకూడా వాటిలో అంతర్భాగంంగా వుండాలి. ఇది పాలకులకు తెలియని విషయంకాదు. వింధ్య పర్వతాలకు దక్షిణానవున్న దక్కను పీఠభూమిలోని వర్షఛాయా ప్రాంతాన్నంతా కరవు పీడిత ప్రాంతంగా వుంచాలనే దోపిడీపాలక వర్గాలు కోరుకుంటున్నాయి. కనుకనే 60 ఏళ్లు గడిచినా, ఎన్ని ప్రాజెక్టులకు శంఖుస్థాపనలు జరిగినా ఈ ప్రాంత రైతాంగం వర్షాధార సాగునే సాగిస్తున్నారు. కారు చౌకగా నగరాలలో శ్రమశక్తిని అమ్ముకుని నికృష్ట జీవితాలను సాగించే దుస్థితిలోనే  ఈ  ప్రాంతంలోని  మూడు రాష్ట్రాల ప్రజలనూ వుంచారు. ఈ సందర్భంగానే 200ఏళ్లుగా లేని నీటి ఎద్దడి, ఏ ప్రాజెక్టులూ కట్టకుండానే గత నాలుగేళ్లుగా గోదావరి బ్యారేజి ఆయకట్టుకు ఏర్పడిందని చెప్పటం, రైతాంగానికి ప్రత్యామ్నాయం చూసుకోమని చెప్పటంకూడా సత్యదూరమేనని భావించాలి. రైతాంగానికి సాగుభారంచేసి కాంట్రాక్టు/కార్పోరేటు సాగువైపు నెట్టేందుకు ప్రభుత్వమనుసరిస్తున్న దురుద్దేశ పూరిత విధానమేయిది. చంద్రబాబు సాగు దండగమారి అన్నా, కిరణ్‌కుమార్‌రెడ్డి ఏ దేశంలోనూ సాగుగిట్టుబాటుగా లేదన్నా, మాటల తేడాతప్ప ఈ విధానాన్నే సమర్థిస్తున్నారు.

సాగునీటి సౌకర్యం కల్పించకుండా విశాల ప్రాంత రైతాంగాన్నీ, కల్పించిన ప్రాంతంలోని రైతాంగాన్నీ కూడా నిరంతరం సంక్షోభంలో వుంచుతున్న తమ విధానాన్ని కప్పిపుచ్చుకుంటూ, పాలకులు ప్రజల దృష్టి మళ్లించేందుకు వివాదాలు సృష్టిస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వ చేతగానితనం వల్ల రాష్ట్రం నష్టపోయిందని టిడిపి విమర్శిస్తే, మీ పాలనలో మీ నిర్వాకపు పాప ఫలితాన్ని మేమిప్పుడు మోయాల్సి వచ్చిందంటూ కాంగ్రెసు ప్రతి విమర్శ చేస్తున్నది. 54 ఏళ్ళ యిరువురి పాలనలో కూడా శంఖుస్థాపనరాళ్లు తప్ప సాగునీటి సౌకర్యం కల్పించలేక పోవటానికి కారణాలేమిటో ఏనాడూ చర్చించరు.

ట్రిబ్యునల్ తీర్పుతో ఉన్ననీటని పంపకం చేసినందున, కేటాయింపుల్లో ఎక్కువ తక్కువలుంటాయి. కేటాయించిన నీటిని సాగు అవసరాలకు ప్రాధాన్యతనిచ్చి సద్వినియోగపరిస్తే, ఏ రాష్ట్రానికి చెందిన వారైనా రైతాంగం లబ్ధిపొందుతారు. నేటి అభివృద్ధి చెందిన సాంకేతిక పరిజ్ఞానంతో సమగ్ర నీటి వినియోగ పథకాన్ని రచించి అమలు జరపటం సాధ్యమౌతుంది. అలాచేయాలంటే నదీ పరివాహక ప్రాంతాన్నంతా ఒకే యూనిటుగా పరిగణించి, సమగ్రనీటి, భూ వినియోగ పథకాన్ని రూపొందించాలి. దాని అమలుకు చట్టబద్ధతగల స్వతంత్ర ప్రతిపత్తిగల సంస్థను ఏర్పాటు చేయాలి. అప్పుడు మాత్రమే నదీజలాలపై అంతరాష్ట్ర వివాదాలకు తావుండదు. రైతాంగానికి  సాగునీరందుతుంది.

వ్యవసాయ రంగంలోకి సామ్రాజ్య వాదుల చొరబాటుకు అన్ని మార్గాలు తెరుస్తున్న పాలకులు, చిన్న కమతాలవల్లే వ్యవసాయం గిట్టుబాటు కావటం లేదంటూ కార్పోరేటు/కాంట్రాక్టు వ్యవసాయ క్షేత్రాల ఏర్పాటుకు పూనుకున్న పాలకులు రైతాంగానికి అనుకూలంగా నీటి వినియోగ పథకాన్ని ముందుకు రానివ్వరు. పాలకులు సృష్టిస్తున్న వివాదాలకూ, ప్రాంతీయ వైమనస్యాలకు లోనుకాకుండా రైతాంగం సాగునీటి కొరకు సంఘటితంగా పోరాడి  సాధించుకోవాలి. **T**

**ఎందుకూ...** (మొదటి పేజీ తరువాయి)

## రైతులను యాచకులుగా పరిగణిస్తున్న ప్రభుత్వం

పంటపరిహారం పెంచాలని, ధాన్యం మొత్తం కొనుగోలు చేయాలని, బీమా పరిహార నిబంధనలు సడలించాలని ప్రతిపక్షపార్టీలు, రైతు, రైతుకూలీ సంఘాలు ఆందోళన చేస్తున్నప్పటకీ పరిహారం ప్యాకేజీలో ఎటువంటి మార్పూ వుండదని ముఖ్యమంత్రి ప్రకటించటం ద్వారా, తాను యిచ్చేదే తీసుకోవాలి అన్నట్లు ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందుల ధరలు తగ్గించి, పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి, అమ్మకాలకు మార్కెట్ ధరలు కల్పించి ఉన్నట్లయితే ఒక సంవత్సరం పంట నష్టపోయినా రైతాంగం ఒడిదుడుకులను ఎదుర్కోగలిగే స్థితిలో వుండేవారు కానీ, ఇలాంటి విధానాలను అమలు జరపకుండా సామ్రాజ్యవాద, బహుళజాతి సంస్థల ప్రయోజనాలు కాపాడుతున్న  పాలక ప్రభుత్వాలు వ్యవసాయాన్ని దండగగా మార్చి రైతాంగాన్ని అప్పుల ఊబిలోకి నెడుతున్నారు. ఇలాంటి స్థితిలో నష్టపోయిన రైతులకు చేయూత అవసరమైంది. అలాంటి చేయూతను పొందటం వారి హక్కు. బిక్షను వారు కోరటంలేదు. వ్యవసాయరంగం ద్వారా వేలాది కోట్ల రూపాయలు ప్రభుత్వానికి ఆదాయం వస్తున్నది. రైతు కూలీల, పేదల స్వేదంతో ప్రభుత్వం నడుస్తున్నది. అందువలన రైతులకు, కూలీలకు ఆపత్కాలంలో సహాయం అందించటం పాలక ప్రభుత్వం బాధ్యత. ఆ బాధ్యతను పాలకులు విస్మరించి రైతులను, పేదలను యాచకులుగా జమకట్టి  వ్యవహరిస్తున్నారు.

## రైతుల ఆత్మహత్యలు

ప్రతీ సంవత్సరం పంటల పెట్టుబడులు పెరుగుతూవుండటం, ఏదో ఒకరూపంలో పంట నష్టం జరుగుతూ, గిట్టుబాటు ధర లభించక అప్పులపాలౌతున్న రైతులు ఆ ఊబి నుండి బయటపడే మార్గం కన్పించక ఆత్మహత్యలే శరణ్యమన్న మానసిక స్థితికి లోనవుతున్నారు. ఏపార్టీ ప్రభుత్వం అధికారంలోకి వొచ్చినా ఆత్మహత్యల పరంపర కొనసాగుతూనే ఉంది. తెలుగుదేశం పార్టీ అధికారం వున్న కాలంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యవసాయం దండగమారిదిగా పేర్కొన్నారు. రైతాంగానికి ఎటువంటి పోత్సాహం లభించలేదు. రైతాంగం ఆత్మహత్యలకు పాల్పడ్డారు. 1999-2003 మధ్య కాలంలో రాష్ట్రంలో  8,704 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. తెలుగుదేశం విధానాలను తీవ్రంగా విమర్శించి రైతు సమస్యలకు పరిష్కారంతో పాటు, ఆత్మహత్యలను నివారిస్తానని చెప్పి రాజశేఖర్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్‌పార్టీ తిరిగి అధికారాన్ని చేపట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రైతు ప్యాకేజీలేవీ వారి ఆత్మహత్యలను ఆపలేకపోయాయి. స్వామినాధన్, జయతీఘోష్ తదితర వ్యవసాయ రంగ కమీషన్ల నివేదికలను బుట్టదాఖలుచేసి కాంట్రాక్టు, కార్పోరేట్ సేద్యంవైపు వ్యవసాయాన్ని మళ్ళించే విధానాలతోపాటు, సెజ్‌ల పేరుతో రైతుల భూములను దేశీయ, విదేశీబడా సంస్థలకు అప్పగించే విధానాలు అమలు జరిపారు. ఆ విధమైన ప్రభుత్వ విధానాల ఫలితంగా 2004-08 సంవత్సరాలకాలంలో 11,665 మంది రైతులు అప్పులు తీర్చలేని పరిస్థితుల్లో ఆత్మహత్యలు చేసుకున్నారు. దేశంలోనే ఋణగ్రస్త రైతులు రాష్ట్రంలోనే అధికంగా ఉన్నారు.

ఈ సంవత్సరం సెప్టెంబరు నుండి డిసెంబరు 9వరకు భారీ వర్షాలు, వరదల వలన సంభవించిన పంట నష్టం ఇటీవల కాలంలో రైతులకు జరిగిన పెద్దనష్టం. గత అప్పులకు తోడు ఇప్పుడు సంభవించిన అపార నష్టంతో రైతాంగం జీవనాడులు కృంగిపోయాయి. ఈ అప్పుల నుండి బయట పడటం అసాధ్యమనే మానసిక మనోవేదనకు లోనయ్యారు. బ్యాంకులు, వడ్డీవ్యాపారులు పెట్టే వేధింపులు, అవమానాలు కళ్ళముందు ప్రత్యక్షమైనాయి. వాటిని భరించటంకన్నా చనిపోవటమే మార్గమన్న నిర్ణయాలకు వచ్చారు. ప్రభుత్వం ప్రకటించిన సహాయ ప్యాకేజీ, తమకు ఎటువంటి ఉపశమనం ఇవ్వదని తేలిపోయింది. దాని పర్యవసానమే రోజురోజుకీ పెరుగుతున్న ఆత్మహత్యలు. గత 20 రోజుల్లో రాష్ట్ర వ్యాపితంగా 2 వందల దాకా రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారంటే, తీవ్ర మానసిక వత్తిడి కారణంగా గుండెపోటుకు గురై మరణించారంటే రైతుల మానసిక ఆందోళన తీవ్రత అర్ధమౌతుంది. ఆత్మహత్యలు చేసుకొన్నవారిలో 130 మందిదాకా కౌలు రైతులే అన్న వాస్తవం, వారి దుర్భర పరిస్థితికి అద్దం పడుతున్నది.

**శ్రీకాకుళం** జిల్లాలో చనిపోయిన పన్నెండు మందిలో పదిమంది కౌలు రైతులే ఉన్నారు. పంటనష్టాన్ని చూసి తట్టుకోలేక గుండెపోటుతో ఎక్కువమంది మరణించారు. **విజయనగరం** జిల్లాలో ఐదుగురు రైతులు ప్రాణాలు కోల్పోయారు. వారిలో నలుగురు కౌలు రైతులు. బోగాపురం మండలం పోలేపల్లికి చెందిన కౌలు రైతులైన అన్నదమ్ములు కునిశెట్టి పైడినాయుడు, అప్పలనాయుడు వరి సాగుకోసం 60 వేలు అప్పుచేశారు. వర్షాలకు పంట నష్టపోయి ఎలా తీర్చాలన్న బెంగతో చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. మక్కున మండలం  కాశీపట్నం పంచాయితీ కొండరేజారుకు చెందిన వాకాడ ముసిలినాయుడు అనే కౌలు రైతు కుప్పలుగా వేసిన పంట మొలకెత్తటంతో దానికి పరిహారం రాదని రెవిన్యూ అధికారులు చెప్పటంతో గుండెపోటుకి  గురై  మరణించారు.

**విశాఖ** జిల్లాలో ఆరుగురు రైతులు తనువు చాలించారు. వీరిలో ఒక మహిళతో సహా ఇద్దరు కౌలు రైతులు ఉన్నారు. **తూర్పుగోదావరి** జిల్లాలో 20 మంది రైతులు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఎనిమిదిమంది కౌలురైతులు ఉన్నారు. పంటనష్టపోవటంతో గుండెపోటుకుగురై 14 మంది మరణించారు. **పశ్చిమగోదావరి** జిల్లాలో మృతి చెందిన రైతుల సంఖ్య 24కు చేరింది. వీరిలో 17 మంది కౌలురైతులే. పంటనష్టాన్ని తట్టుకోలేక 7గురు ఆత్మహత్యలకు పాల్పడగా, మిగతావారు గుండెపోటుకి గురై మరణించారు. పశ్చిమ గోదావరి జిల్లా మండల కేంద్రాలైన దేవీపట్నంస పోలవరంలలో రైతు కూలీసంఘం (ఆం.ప్ర.) ఆధ్వర్యంలో రైతాంగ సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రదర్శన, ధర్నా కార్యక్రమాలను నిర్వహించారు.

**కృష్ణాజిల్లాలో** ఇప్పటివరకు 30 మంది రైతుల ప్రాణాలు గాలిలో కలసిపోయాయి వీరిలో 22 మంది కౌలు రైతులే. గంపల గూడెం మండలం చిన్నవరానికి చెందిన **(తరువాయి 3వ పేజీలో)**

# మరింత దూకుడు దిశగా 'నాటో' సమావేశం

21వ శతాబ్దపు 'నూతన వ్యూహాత్మక అవగాహన'పై చర్చించేందుకు 2010 నవంబరు 19,20 తేదీలలో లిస్బన్‌లో 'నాటో' కూటమి దేశాలు సమావేశమయ్యాయి.

ఆది నుండీ అమెరికా అన్నివిధాలా 'నాటో' కూటమికి నాయకత్వం వహిస్తోంది. తమ ప్రాధాన్యతలకూ, లక్ష్యాలకూ అనుగుణంగా సైనిక స్థావరాల ఏర్పాటుకు ప్రణాళికలను రూపొందించేందుకూ; వాటికి అవసరమైన ఆయుధాలను, ఆర్థికాన్ని సమకూర్చేందుకూ అమెరికన్ సామ్రాజ్యవాదులు వ్యూహాలను రచిస్తున్నారు. 'నాటో'చర్యలకు వారు మార్గదర్శకత్వం వహిస్తున్నారు. ఈసారికూడా 'నాటో' శిఖరాగ్ర సమావేశానికి మార్గదర్శకాలను అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా రూపొందించాడు. వాటిని ఈ సమావేశం ఆమోదించింది కూడా.

'నాటో' సమావేశానికి కొద్ది రోజుల ముందుగా రాసిన ఒక వ్యాసంలో 'అమెరికా-నాటోల సంబంధాలు ప్రపంచ వ్యవహారాలలో అమెరికా పాత్ర నిర్వహణకు ఒక మూల మలుపుగానూ, ప్రపంచ సహకారానికి ఒక ఉత్ప్రేరకంగానూ ఉంటాయని' ఒబామా పేర్కొన్నాడు. యూరప్‌కానీ, అమెరికాకానీ మరొకరి సహకారం లేకుండా తమ ముందున్న సవాళ్ళను ఎదుర్కోలేవని ఆయన స్పష్టపరిచాడు. ఒకరిమీద దాడి జరిగితే అందరిమీదా దాడి చేసినట్లేనని ఆయన పునరుద్ఘాటించాడు. ఈనాడు తమనుతాము కాపాడుకునేందుకు, రేపటి కర్తవ్యాలను నెరవేర్చేందుకు తమ శక్తి సామర్థ్యాలను 'నాటో' పరిధిలోని ప్రాంతాలను క్షిపణులతో రక్షించుకోవలసిన అవసరం ఉందన్నాడు. మరోవైపున 'అణ్వాయుధాలు లేని ప్రపంచం' అనే మంత్రాన్ని జపిస్తున్నాడు. సురక్షితమైన, తమ భాగస్వాముల రక్షణకు హామీనివ్వగల ప్రతిభావవంతమైన అణ్వాయుధాలను నిర్వహిస్తున్నామని ఆయన మరో మారు స్పష్టం చేశాడు. ఈ ఆయుధాలు వున్నంతకాలమూ 'నాటో' అణు కూటమిగా వుంటుందన్నాడు. 'నాటో' కూటమి ప్రపంచ భద్రతకు మూల స్తంభంలా నిలవటానికి అవసరమైన భాగస్వాములను 'నాటో' వెలుపలకూడా కొనసాగిస్తామని అన్నాడు. నాటో సభ్యత్వానికి అర్హమైన ప్రమాణాలున్న యూరప్ ప్రజాస్వామిక దేశాలకు ద్వారాలు తెరవటం చాలదన్నారు. 'నాటో'ను శక్తివంతంచేసే యూరోపియన్ యూనియన్, ఐక్యరాజ్య సమితి, యూరప్ సహకార భద్రతా సంస్థ మొదలైన సంస్థలతో సహకారాన్ని మరింత పెంపొందించుకోవాలన్నారు. అమెరికా, రష్యాలు తమ మధ్య సంబంధాలను ఏ విధంగా పునర్నిర్మించుకున్నాయో 'నాటో' కూటమి, రష్యాల మధ్య సంబంధాలు కూడా అదేవిధంగా రూపొందాలన్నాడు. రష్యా, 'నాటో'కు శత్రువుకాదని, భాగస్వామేననీ లిస్బన్‌లో స్పష్టం చేస్తున్నామన్నాడు.

'నాటో' ప్రారంభమైన నాటినుండి ప్రపంచంలోని పీడిత జాతుల, ప్రజల అణచివేత సాధనంగా వుంది. అమెరికా యూరప్ సామ్రాజ్యవాదుల ప్రయోజనాల రక్షణ కొరకు సంయుక్త సైనిక వేదికగా వుంది. ప్రపంచంపై అమెరికా సామ్రాజ్యవాద పెత్తనాన్ని కొనసాగించేందుకు, అమెరికా వ్యూహాత్మక లక్ష్యాలను సాగించేందుకు, కొల్లగొట్టిన ధనాన్ని తమ మధ్య పంపిణీ చేసుకునేందుకు బేరసారాలాడే కేంద్రంగా వుంది.

'నాటో'లోని అమెరికా మరియు ఇతర సామ్రాజ్యవాదులు మౌలికంగా రెండురకాల శత్రువుల నెదుర్కొంటున్నారు. సామ్రాజ్యవాద దోపిడీ, పీడనల క్రింద, ఆధిపత్యం క్రింద నలిగిపోతున్న దేశాల పీడిత ప్రజానీకం ఆ శత్రువులలో మొదటిది. ఇతర దేశాల పీడిత ఇతర దేశాల వనరులను, సంపదలను కొల్లగొట్టటానికి, ఆయా దేశాల ప్రజల శ్రమను నిరాటంకంగా దోచుకోవటానికి, ఆయా దేశాల అంతరంగిక వ్యవహారాలలో జోక్యం చేసుకోవటానికి, తమ ఆధిపత్యం క్రిందకు తెచ్చుకోవడానికి, తమ దాడులు సాగించటానికి అమెరికాతో ఇతర సామ్రాజ్యవాదులు చేతులు కలిపారు. అమెరికా, దాని మిత్రులు ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్‌లలో చేసిన యుద్ధాలు ఇందులో భాగమే. కావున ఇతరదేశాల దాడులనుండి తమ దేశాల ప్రజలను రక్షించుకోవటానికే 'నాటో' చర్యలు వుంటాయని చెప్పన్న ఒబామా మాటలు మోసపూరితమైనవీ, తప్పుదోవ పట్టించేవి. దానికి భిన్నంగా పీడిత దేశాలకు, ఆయా దేశాల ప్రజలకు-అమెరికా, దాని మిత్రదేశాల దాడుల నుండి రక్షించుకోవలసిన, తమ జీవితాలను హక్కులను కాపాడుకోవలసిన అవసరం ఏర్పడింది.

ఇక 'నాటో' కూటమి ఎదుర్కొంటున్న మరొక శత్రువు రష్యా. రష్యాకున్న వనరులు, ఆయుధ సంపత్తి, రష్యాతన పూర్వవైభవాన్ని తిరిగి పొందటానికి, తన ప్రభావిత ప్రాంతాలను విస్తరించుకోవటానికి చేస్తున్న ప్రయత్నాల కారణంగా 'నాటో' కూటమికి – రష్యాకు మధ్య వైరుధ్యాలు తలెత్తుతున్నాయి. ప్రస్తుత రాజకీయ వాతావరణంలో అమెరికా, రష్యాల మధ్య సంబంధాలు ఘర్షణపూరితంగా వున్నాయి.

ఇచ్చిపుచ్చుకునే ప్రాతిపదికన –అమెరికాతోనూ, 'నాటో' కూటమితోనూ చర్చలు రష్యా జరుపుతున్నది. కొన్ని ఒప్పందాలను కుదుర్చుకుంటున్నది. ఆయుధ శక్తితో తమ అగ్రరాజ్య హోదాను నిలుపుకునేందుకు అమెరికా, రష్యాలు రెండు 'స్టార్ట్' (START) ఒప్పందంపై సంతకాలు చేశాయి. టెర్రరిస్టు వ్యతిరేక చర్యలు, మాదక ద్రవ్య వ్యతిరేక చర్యలు, సముద్రపు దొంగలతో వ్యవహరించవలసిన తీరు మొదలైన అంశాలపై అమెరికా, 'నాటో' కూటములతో రష్యా సైనిక సహకార ఒప్పందాలను కుదుర్చుకున్నది. అమెరికాకు, దాని మిత్రదేశాల బలగాలకు అవసరమైన సరఫరాలు చేయుటకు తమ భూభాగాన్ని వినియోగించుకోవటానికి అనుమతించటం ద్వారా ఆఫ్ఘనిస్థాన్ యుద్ధంలో అమెరికాకూ, 'నాటో'కూ రష్యా సహకరించింది. ఆఫ్ఘనిస్థాన్‌లోని మాదక ద్రవ్య ప్రయోగశాలలను నాశనం చేసేందుకు మొట్టమొదటిగా 2010 అక్టోబరులో రష్యా, అమెరికాలు సంయుక్తంగా చర్యలు చేపట్టాయి. ఆఫ్ఘనిస్థాన్‌కు సరఫరాలు చేసే మార్గంలో రష్యా భూభాగాల్ని వినియోగించుకోవటానికి అనుమతించేందుకు; ఆఫ్ఘనిస్తాన్, ఇంకా ఇతర మధ్య ఆసియా దేశాలలోని మాదక ద్రవ్య వ్యతిరేక ఏజెంట్లకు రష్యాలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించేందుకు రష్యన్ దేశాధ్యక్షులు మెద్వెదేవ్ లిస్బన్‌లో 'నాటో'తో ఒప్పందంపై సంతకాలు చేశాడు. ఆఫ్ఘన్ హెలికాప్టర్ సిబ్బందికి శిక్షణ నివ్వటానికి, ఆఫ్ఘన్ సైనిక బలగాలకు మరిన్ని రష్యన్ హెలికాప్టర్లను కొనుగోలు చేయటానికి, ఆఫ్ఘన్ పాలకులు ఉపయోగించిన రష్యన్ పరికరాలను మరమ్మత్తు చేయటానికి వారిమధ్య అంగీకారం కుదిరింది. రష్యా అణుశక్తి ఉత్పత్తిలో బలీయమైన శక్తిగా వుండి, ఇతర చిన్న బలహీన దేశాలు అణ్వాయుధాలు తయారు చేసుకొనకుండా నిషేధం విధించడంలో అమెరికాతో సహకరిస్తోంది. బలహీన దేశాలపై పెద్ద దేశాల పెత్తనం కొనసాగేటందుకే ఇలా వ్యవహరిస్తున్నది.

అదే సమయంలో అమెరికా, రష్యాల స్వీయ ప్రయోజనాలరీత్యా వాటి మధ్య వైరుధ్యం ప్రస్ఫుటంగా కనబడుతోంది.

గత రెండు దశాబ్దాల్లో సభ్యత్వ సంఖ్యరీత్యా, అందులోవున్న ప్రాంతాలరీత్యా, ఆయుధబలంరీత్యా 'నాటో' అనూహ్యంగా విస్తరించింది. రష్యాను చుట్టి వేసే ప్రయత్నంలో భాగంగా గత 'వార్సా' సంధి ఒప్పంద దేశాలకు, బాల్టిక్ రాజ్యాలకు 'నాటో'లో సభ్యత్వాన్నిచ్చింది. ఈ కొత్త సభ్య దేశాల భూభాగంలో తన సైన్యాలను మోహరించింది. రష్యా వ్యూహాత్మక ఆయుధాగారాలపై దాడికి అందుబాటులో వుండే విధంగా పోలెండు, చెక్ రిపబ్లిక్‌లలో క్షిపణి రక్షణ స్థావరాలను ఏర్పరచుకునే అమెరికా పథకానికి 'నాటో' అంగీకరించింది.

'నాటో' విస్తరణను రష్యా తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. కొత్త వ్యూహానికి అనుగుణంగా 'నాటో'ను 'ప్రపంచ పాత్రధారి'గా అమెరికా నిర్వచిస్తున్నది. నాటో 'ప్రపంచ పోలీసు'గా వ్యవహరించటాన్ని అంగీకరించటంలేదని రష్యా ప్రకటించింది. ఆర్కిటిక్ సముద్రం తాను బాధ్యత వహించే ప్రాంతమనీ, అక్కడ జరిగే యుద్ధాలకు, చర్యలకు తన బాధ్యత ఉంటుందని 'నాటో' ప్రకటించటంపై రష్యా ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఆర్కిటిక్ సముద్ర ప్రాంతంలో ప్రపంచంలోని చమురు, సహజవాయు నిల్వలలో నాలుగవ వంతు వున్నాయి. వాటిలో 60 శాతం రష్యా ప్రాంతంలో వున్నాయనేది గమనంలో వుంచుకోవాలి. ఈ ప్రాంతంలో విరివిగా లభించే సహజవనరులపై తన ఆధిపత్యాన్ని, పట్టును నిలుపుకోవటానికి రష్యా తనకు చేతనైన అన్ని రాజకీయ, సైనిక, దౌత్యప్రయత్నాలనుంచే చేపడుతూ, తన పెత్తనాన్ని పటిష్టపరుచుకుంటూ ఈ ప్రాంతంలో అమెరికా మరియు 'నాటో' దళాలను ప్రవేశించ నివ్వకుండా అడ్డుకుంటున్నది. అమెరికాకూ, యూరప్‌కూ, క్షిపణి రక్షణ కవచం ఏర్పాటు చేయటానికి అమెరికా చేస్తున్న ప్రయత్నాలను రష్యా వ్యతిరేకిస్తున్నది. అదే సమయంలో 'సమాన ప్రాతిపదిక' మీద సహకరించుటకు అంగీకారాన్ని తెలుపుతోంది. క్షిపణి దాడుల వలన కలిగే ప్రమాదాన్ని సమగ్రంగా అంచనావేసి తదనుగుణంగా రష్యా, 'నాటో'లు సంయుక్తంగా రక్షణ స్థావరాలను నిర్మించటానికే రష్యా వత్తిడి చేస్తున్నది. కానీ లిస్బన్‌లో జరిగిన 'నాటో' సమావేశం క్షిపణి రక్షణ స్థావరాన్ని నిర్మించాలని నిర్ణయించింది. ఆ స్థావర ఏర్పాటుకు, అభివృద్ధికి రష్యా సహకారమందిస్తుందో, లేదో తెలుసుకోవాలనుకుంటోంది. రానున్న దశాబ్దానికి నూతన వ్యూహాన్ని ఈ సమావేశం రూపొందించి ఆమోదించింది. నాటో విస్తరణ, నాటోసైనిక జోక్యం మొదలైన అంశాలపై మాట్లాడటానికి అవకాశమిచ్చే విధంగావున్న ట్రాన్స్-అట్లాంటిక్ ఒప్పందాన్ని గురించిన రష్యా ప్రతిపాదనను, చొరవను అమెరికా తిరస్కరించింది.

అమెరికాతోనూ, నాటో కూటమితోను అనేక విషయాలలో కుమ్మక్కు అయిన రష్యా, భవిష్యత్తులో తన అవకాశాలను మెరుగు పరుచుకోవటానికి, తన లక్ష్యాలను సాధించటానికి, తన ప్రభావాన్ని విస్తరింప జేసుకోవటానికి, దోపిడీలో భాగాన్ని పొందటానికి, కొత్త సంకీర్ణాలతో, కొత్త మిత్రులతో సంబంధాలు పెంచుకొని మరింత బలపడి ప్రపంచంలో తన శక్తిని పెంచుకోవటానికి ప్రయత్నిస్తోంది. రష్యా, అమెరికాల మధ్యనున్న సంబంధాలు ఎలా పరిణమించి ఏ విధంగా బద్ధలవుతాయనేది భవిష్యత్ పరిణామాలే వెల్లడిచేస్తాయి.

రానున్న కాలంలో అణచివేయబడుతున్న దేశాలు, ప్రజలపై మరింత క్రూరమైన దాడులు జరపడానికి 'నాటో' చేస్తున్న ఉన్మాద పూరిత ఏర్పాట్లకు లిస్బన్ సమావేశం ఆమోదించిన 'నూతన వ్యూహ అవగాహన' ఒక సూచిక! దీని ద్వారా వారంతటవారే మరిన్ని సమస్యలను సృష్టించుకుంటున్నారు. ✱

## ఎందుకూ... (రెండవ పేజీ తరువాయి)

బంకా వెంకులుకు చెందిన 6 ఎకరాల్లోని పంట పూర్తిగా మొలకెత్తటంతో తట్టుకోలేక గుండెపోటుతో మరణించాడు. జగ్గయ్యపేట మండలానికి చెందిన ముక్త్యాల గ్రామరైతు గుగులోతు వీరయ్య పొలంలోని పత్తి తడిసి పోవటంతో ఉద్వేగానికి గురై ప్రాణాలు కోల్పోయాడు. విస్సన్నపేట మండలం తెల్లదేవరపల్లి గ్రామానికి చెందిన కౌలురైతు కొతేపల్లి సీతారామయ్య పంటనష్టాన్ని తట్టుకోలేక పొలంలోకి వెళ్ళి ప్రాణాలు కోల్పోయాడు. **గుంటూరు** జిల్లాలో రైతుల మృత్యుఘోషలు హృదయవిదారకంగా ఉన్నాయి. ఇప్పటివరకు యాభై మంది రైతులు ప్రాణాలు కోల్పోయారు. పురుగుమందులు, ఉరి తాళ్ళను కొందరు రైతులు ఆశ్రయించగా మరికొందరు గుండె పోటుకి గురై మరణించారు. రైతుల ఆత్మహత్యల్లో కౌలు రైతులు ఎక్కువగా ఉన్నారు. ముప్పాళ్ళ, నాదెండ్ల, తుళ్ళూరు, దాచేపల్లి, బొల్లాపల్లి, వట్టిచెరుకూరు, పిడుగురాళ్ళ, గురజాల, కొల్లిపర, కొల్లూరు, చెరుకుపల్లి, మండలాల్లో రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ప్రాణాలు కోల్పోయిన వారందరూ పంటనష్టపోవటంతో అప్పులు తీరే మార్గం కానరాక ప్రాణాలు కోల్పోయినవారే. గుంటూరు జిల్లాలో ఇంకా మండలకేంద్రాలైన రేపల్లె, ప్రత్తిపాడులో రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర పిలుపు మేరకు ముంపురైతాంగ సమస్యల పరిష్కారాన్ని డిమాండ్ చేస్తూ ధర్నా కార్యక్రమాలను నిర్వహించి సంబంధిత అధికారులకు మెమోరాండం అందజేశారు. **ప్రకాశం** జిల్లాలో ఏడుగురు రైతులు అసువులుబాశారు. అందరూ కౌలురైతులే. ముగ్గురు గుండెపోటుతోను, మిగిలిన వారు ఆత్మహత్యలకు పాల్పడి ప్రాణాలు కోల్పోయారు. **కడప** జిల్లాలో ముగ్గురు రైతులు ఆత్మహత్యలు చేసుకొని మరణించారు. **అనంతపురం** జిల్లాలో ఆరుగురు రైతులు ఆత్మహత్యలు, గుండెపోటు వలన ప్రాణాలు కోల్పోయారు. **కర్నూలు** జిల్లాలో 16 మంది రైతులు ప్రాణాలు కోల్పోయారు పదిమంది ఆత్మహత్యలు చేసుకోగా, ఆరుగురు గుండెపోటుకు గురై మరణించారు. **మహబూబ్‌నగర్** జిల్లాలో ఐదుగురు రైతులు, మరో కౌలు రైతు ఆత్మహత్యలు చేసుకొని చనిపోయారు. **వరంగల్** జిల్లాలో ముగ్గురు కౌలు రైతులు, మరోయిద్దరు రైతులు ఆత్మహత్యలకు పాల్పడి ప్రాణాలు కోల్పోయారు. గోవిందరావు పేట మండలానికి చెందిన వస్రాగ్రామరైతు నన్నెబోయిన నర్సయ్య రెండున్నర ఎకరాలు కౌలు సాగు చేశాడు. పంట నష్టపోయి పెట్టుబడి వచ్చే పరిస్థితి లేక మనోవ్యధకు గురై కుప్పకూలి చనిపోయాడు. **రంగారెడ్డి** జిల్లాలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. బషీరాబాద్ మండలం కుప్పన్‌కోట తండాకు చెందిన రాములు సొంతభూమి రెండు ఎకరాలతో పాటు మరో ఎకరం కౌలు భూమి సాగుచేశాడు. అందుకు 50 వేలు అప్పుచేశాడు. పంటలకు నష్టం జరగటంతో అప్పు తీర్చే మార్గంలేక పురుగుమందు తాగి ఆత్మహత్యచేసుకున్నాడు. వికారాబాద్ మండలం ప్రలుముద్ది గ్రామానికి చెందిన గాలయ్య 30వేల అప్పు తీర్చే మార్గంలేక ఉరిపోసుకున్నాడు. **కరీంనగర్** జిల్లాలో పురుగుమందు త్రాగి, గుండెపోటుకి గురై ముగ్గురు మరణించారు. **ఆదిలాబాద్** జిల్లాలో ఇద్దరు రైతులు ప్రాణాలు కోల్పోయారు. **నల్గొండ** జిల్లాలో 9 మంది రైతులు మరణించారు. ముగ్గురు గుండెపోటుతో, మిగతావారు ఆత్మహత్యలతో మృతి చెందారు. హుజూర్‌నగర్‌కు చెందిన సుందరయ్య కాలనీలో మట్ట సీతయ్య, తనకున్న రెండున్నర ఎకరాల భూమితోపాటు మరో ఎకరం కౌలుకు తీసుకున్నాడు. సేద్యంకోసం 60వేలు అప్పుచేశాడు. పంట మొలకెత్తి నష్టపోవటం, అప్పులు చెల్లించమని వత్తిడి చేయటంతో గుండెపోటుకిగురై ప్రాణాలు విడిచారు. ఈ విధంగా అన్ని జిల్లాల్లో పంట నష్టానికి గురైన రైతులు ఆత్మహత్యల పరంపర తీవ్రమౌతూ వుంది.

రైతుల ఆత్మహత్యల నేపథ్యంలో, ప్రకటించిన ప్యాకేజి సరిపోదని ఒప్పుకొంటున్న ముఖ్యమంత్రి దాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోకుండా, రైతుల ఆత్మహత్యలను అపహాస్యం చేస్తున్నారు. రైతుల మరణాలకు పంట నష్టానికి సంబంధం లేదంటున్నారు. రైతుల ఆత్మహత్యలకు, వారి మానసిక రుగ్మతలకు ఇతరకారణాలు ఉన్నాయని, ఇది అంటు వ్యాధిలా వ్యాపిస్తుందని, దాన్ని నివారించటానికి డాక్టర్లచేత రైతులకు కౌన్సిలింగ్ జరిపిస్తానని చెప్పటం ద్వారా వారిని అవమానపరుస్తున్నారు. గతంలో చంద్రబాబు కూడా డబ్బులకోసం రైతులు ఆత్మహత్యలు చేసుకొంటున్నారని, పరిహారం చెల్లిస్తే అవి ఇంకా ఎక్కువ అవుతాయని, అసలు వ్యవసాయమే దండగని మాట్లాడాడు. ఇప్పుడు ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి చంద్రబాబు సరసకు చేరాడు.

### రైతాంగానికి విజ్ఞప్తి

ప్రస్తుత పాలక ప్రభుత్వాలు రైతుల ప్రయోజనాలు కాపాడేవికావు. ఇవి-దేశంలోని దళారీ పెట్టుబడిదారుల, భూస్వాముల ప్రయోజనాలు, సామ్రాజ్యవాద, బహుళ జాతి సంస్థల దోపిడీ ప్రయోజనాలు కాపాడేవిగా వున్నాయి. అందుకే విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందుల ధరలు పెంచి సేద్యపు ఖర్చులు పెంచుతున్నాయి. పండిన పంటకు మార్కెట్ సౌకర్యం, గిట్టుబాటుధర కల్పించకుండా రైతును నష్టాలపాల్జేస్తున్నాయి. సాగునీటి సౌకర్యం ఉద్దేశ్యపూర్వకంగానే కొన్ని ప్రాంతాల్లో రైతులను సేద్యానికి దూరం చేస్తున్నారు. పరిశ్రమల పేరుతో సెజ్ చట్టం ద్వారా రైతుల భూములను బడా పారిశ్రామిక వేత్తలకు, బహుళజాతి సంస్థలకు కట్టబెడుతూ, వారిని భూములకు దూరం చేస్తున్నారు. ఇలాంటి విధానాల ద్వారా సేద్యం దండగ అన్న పరిస్థితి రైతాంగానికి కల్పించి, వారి భూములను కాంట్రాక్టు, కార్పోరేట్ సంస్థలకు కట్టబెట్టే చర్యలు తీసుకొంటూ, రైతులను వారివద్ద కూలీలుగా మార్చేందుకు సిద్ధమౌతున్నది. ఇలాంటి విధానాలు అనుసరిస్తున్న ప్రభుత్వం పంట కోల్పోయిన రైతులకు న్యాయమైన సహాయం అందించదు. అప్పులు, ఇతర సమస్యల నుండి బయటపడటానికి ఆత్మహత్యలే పరిష్కారంగా రైతాంగం భావించరాదు. అది పిరికితనం. తమ రెక్కల కష్టంతో బీడుభూములనే బద్దలు చేసి సేద్యానికి అనుగుణంగా మార్చి పంటలు పండిస్తున్న రైతులు కష్టాలకు, నష్టాలకు అధైర్య పడకుండా పాలక ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతువ్యతిరేక విధానాలపై తమ పోరాటాన్ని ఎక్కుపెట్టాలి. ఆపద సమయంలో సహాయం పొందటం హక్కుగా ఉద్యమించాలి. పంట నష్టపోయిన ప్రతిరైతుకు (కౌలురైతులతో సహా) ఎకరానికి రు. 15వేలు పరిహారం, ఈసంవత్సరం రైతుల అప్పుల రద్దు, మొత్తం పంటనష్టానికి బీమా పరిహారం వర్తింపు, రబీ సాగుకి పంటరుణాల హెచ్చింపు, ఉచితంగా విత్తనాలు, ఎరువుల కోసం సామ్రాజ్యవాద, బహుళజాతి సంస్థల దోపిడీ రద్దు కోసం ఉద్యమిస్తూ రైతాంగపోరాటశక్తిని చాటాలి. అప్పుడే రైతుల సమస్యకు పరిష్కారం లభిస్తుంది. ✱

# ప్రపంచ వ్యాపితంగా ప్రజల నిరసనాందోళనలు

## గ్రీసులో సంయుక్త సైనిక విన్యాసాలకు వ్యతిరేకత

**మధ్య** పశ్చిమ గ్రీసులోని అనేక ప్రాంతాలలో గ్రీకు-ఇజ్రాయిల్ సంయుక్త సైనిక విన్యాసాలు నిర్వహించారు. ఇరాన్‌పై నిర్వహించ తలపెట్టిన సైనిక దాడికి సన్నాహకంగా ఈ విన్యాసాలను సాగించారు. గ్రీసులోని ఈ ప్రాంతాలు ఇరాన్ భౌగోళిక ప్రాంతాలను పోలివున్న కారణంగా ఇక్కడ ఈ కసరత్తు నిర్వహించారు. ఈ సంయుక్త సైనిక విన్యాసాలలో 8 ఇజ్రాయిలీ యుద్ధ హెలీకాప్టర్‌లు, 3 గ్రీసు హెలీకాప్టర్లు, 6 యుద్ధవిమానాలు ఉపయోగించారు. ఈ కసరత్తులకు విమాన స్థావరాన్ని కేంద్రంగా చేసుకున్నారు. స్థానిక ప్రజలను ఈ సైనిక విన్యాసాలు భీతావహులను చేస్తున్నాయి.

గ్రీసు కమ్యూనిస్టు పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు 2010 అక్టోబర్ 12వ తేదీన వేలాదిమంది ఆండ్రాలిడా విమాన స్థావరం వరకు కదిలివచ్చి పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన, ధర్నాను నిర్వహించారు. 'ఇజ్రాయిల్ సామ్రాజ్యవాదులారా, మాదేశాన్ని వదిలిపొండి' 'పాలస్తీనా ప్రజల హంతకులారా, మాదేశాన్నుండి వెళ్ళిపొండి' 'మేము సామ్రాజ్యవాదుల ముందు తలవంచబోవటంలేదు' 'ప్రజలే గొప్ప ఉద్యమ నాయకులు' వంటి నినాదాలను చేస్తూ, బ్యానర్లపై ప్రదర్శిస్తూ ఆందోళనకారులు ప్రదర్శనలో పాల్గొన్నారు. గ్రీసు కమ్యూనిస్టు పార్టీ (కెకెఇ) నాయకులు యుద్ధవిమానం - 117కు చెందిన కమాండ్ ప్రతినిధిని కలుసుకొని సామ్రాజ్యవాద ఇజ్రాయిల్ సైనిక పథకాలతో చేతులు కలపటం వలన సంభవించే ప్రమాదాల గురించి హెచ్చరించారు.

## చైనాలో జపాన్ వ్యతిరేక నిరసనలు

**2010** సెప్టెంబరులో చైనీయుల చేపలవేట పడవ, జపనీయుల గస్తీనౌకలు వివాదస్పద దీవులవద్ద సంఘర్షించుకొన్న సందర్భాన్ని పురస్కరించుకొని చైనాలో జపాన్ వ్యతిరేక ప్రదర్శనలు పెద్ద ఎత్తున రాజుకున్నాయి. అక్టోబర్ 23న ఛాండ్‌షా, లాంజౌ, డేయాండ్, నగరాలలో జపాన్ వ్యతిరేక ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహించారు. మరిన్ని ధర్నాలు - మారుమూల, చిన్నపట్టణాల్లో జరిగాయి. 'చైనాను ప్రేమించండి - జపాన్ వస్తువులను బహిష్కరించండి' అనే నినాదాలు చేయటంతోపాటు, దేశీయ సమస్యలైన వాక్ స్వాతంత్ర్య హక్కుగురించి, అధికమైన ధరలకు సంబంధించి నినాదాలుచేశారు.

## జాతి వివక్షకు, జాతి వివక్ష చట్టాలకు నిరసన

ప్రపంచంలోని అనేక దేశాలలో జాతి వివక్ష, ఫాసిజం అనేవి పునరుద్ధరించబడి విస్తరిస్తున్నవిగా వున్నాయి. ఉద్యోగావకాశాలను నిరాకరించే అనేక నిరంకుశమైన చట్టాలను చేస్తున్నారు.

ఇజ్రాయిల్ దేశంలో 'విశ్వాసపాత్ర'మని చెప్పబడే ఒక బిల్లు ముందుకుతెచ్చారు. పౌరసత్వపు చట్టాన్ని సవరించారు. ఈ బిల్లుల ఆధారంగా పాలస్తీనా పౌరులను ఇజ్రాయిల్ నుండి బయటకు పంపటం చట్టబద్ధమౌతుంది. అక్టోబర్ 19వ తేదీన ఈ దుర్మార్గమైన బిల్లును నిరసిస్తూ టెల్ - ఆవీవ్ వద్ద పదివేల మంది ప్రజలు నిరసనధర్నా నిర్వహించారు. యూదుల, అరబ్బుల ధర్నా- జాతి వివక్షకు వ్యతిరేకంగా ఐక్యత' అని ఈ ధర్నాకు పేరువుంచారు. ఈ ధర్నాలో పాల్గొన్న వేలాది మంది ప్రజాస్వామికవాదులు, హక్కుల ఉద్యమ కార్యకర్తలు, ప్రభుత్వేతర సంఘాల ప్రతినిధులు గోన్‌మాయిర్ పార్క్‌నుండి రక్షణ మంత్రిత్వశాఖ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వ హించారు. లింగ, జాతి, భాష, సంస్కృతి, ఆర్థిక స్థితిగతుల ప్రాతిపదికన ప్రజలపట్ల ఏవిధమైన వివక్ష చూపరాదని వారు డిమాండ్ చేశారు.

నవంబర్ 9న జాతి వివక్షకు, లండన్‌లో దాని పునరుద్ధరణకు వ్యతిరేకంగా వేలాది మంది ప్రజలు 'జాతి వివక్షను, ఫాసిజాన్ని, ముస్లిం వ్యతిరేకతను నిరసించండి' అని నినదించారు. ఈ ప్రదర్శన పార్లమెంటు వరకు సాగింది. 'లవ్ మ్యూజిక్' 'హేట్ రేసిజం' 'యునైట్ ఎగనెస్ట్ ఫాసిజం' వంటి సంఘాలు ఈ ధర్నాలో పాల్గొని తమ సంగీతం, పాటలతో ప్రదర్శనకారులను ఉత్తేజపరిచాయి.

నవంబర్ 3వ వారంలో జాతి వివక్షకు, ఫాసిజానికి వ్యతిరేకంగా గ్లాస్కో నగరంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఎస్.టి.యు.సికి చెందిన నల్లజాతి కార్మికులు ఈ ప్రదర్శనను నిర్వహించారు. వేలాది కార్మికులు, రాజకీయ నాయకులు, స్థానిక ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్లాస్కోకు చెందిన స్థానిక పార్లమెంట్ సభ్యుడు ఈ కార్యక్రమ నిర్వాహకులలో ఒకరిగా వుండి 'మమ్మల్ని అవమానించటమంటే మాతోసహా అందర్నీ అవమానించటమే' అనే బ్యానర్‌ను ప్రదర్శించాడు

## అణువ్యర్థాల రైలుబండికి నిరసన

'నరకం నుండి రైలుబండి' పేరిట చెర్నోబిల్ విధ్వంసాలకు సరితూగిన 123 టన్నుల అణు వ్యర్థాలను మోసుకెళ్ళే ఓ రైలు ఫ్రాన్స్‌లో 5 నగరాల మీదుగా జర్మనీకి సాగింది. నవంబర్ 5వ తేదీన సియాన్, ఉత్తర ఫ్రాన్స్ ప్రాంతాల్లో ఈ రైలును నిరసన కారులు నిలిపివేశారు. వాలోగ్నస్ నుండి ఈ అణు వ్యర్థాలు జర్మన్‌లోని ఓ నగరానికి 'అరెవా' అనే ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఫ్రెంచి అణు ఇంజనీరింగ్ కంపెనీ ఆధ్వర్యంలో పంపబడింది. డానన్‌బర్గ్ అనే జర్మన్ పట్టణంలో అణు వ్యర్థాలతో కూడిన రైలును నిరసనకారులు నిలిపివేశారు. 3వేల మంది ప్రదర్శన కారులు రైల్వేట్రాక్‌పై నిలిచి నిరసన తెలిపారు - నవంబర్ 6వ తేదీన 25 వేలమంది ప్రజలు డానన్‌బర్గ్ బయట, ఈ అణువ్యర్థాలను నిరసిస్తూ ప్రదర్శనచేశారు.

## జి-20 సమావేశానికి నిరసన

గ్లోబలీకరణ వ్యతిరేక క్యాంపైన్ నిర్వహిస్తున్న 20 వేల మంది నిరసనకారులు నవంబర్ 7వ తేదీన జి-20 సమావేశం నిర్వహించ తలపెట్టిన సెడ్ నగర హాల్‌వద్దనున్న బిగ్‌ప్లాజా ఎదురుగా నిరసన తెలిపారు. ఉద్యోగాల కల్పన, సామాజిక సంక్షేమం, రక్షణ చర్యలనువారు ఈ సందర్భంగా డిమాండ్‌చేశారు.

## ఇండోనేషియాలో ఒబామా పర్యటనకు నిరసన

ఇండోనేషియా దేశరాజధాని జకార్తాలో నవంబర్ 8,9 తేదీలలో అనేక నిరసన ధర్నాలు నిర్వహించారు. ఒబామా రాకను నిరసిస్తూ వేలకొలది ముస్లిములు - అధిక సంఖ్యాకులైన విద్యార్థులు ఈ నిరసన ధర్నాలలో పాల్గొన్నారు. అమెరికా సామ్రాజ్యవాద విదేశాంగ విధానాలకు తాము తలవంచబోమని ఈ సందర్భంగా నిరసనకారులు నినదించారు. ఇండోనేషియా విశ్వ విద్యాలయ విద్యార్థులు, విశ్వవిద్యాలయ క్యాంపస్‌లలో జరిగిన ధర్నాలలో అమెరికా జాతీయ పతాకాలను తగులబెట్టారు. 'స్వేచ్ఛ కోసం విద్యార్థుల ఉద్యమం' అనే సంస్థ నవంబర్ 6న జకార్తాలోని అమెరికా రాయబార కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఒబామా దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఇండోనేషియా దేశ వ్యాపితంగా 20 వేల ముస్లిమ్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 'ఇండోనేషియా అసలైన శత్రువు- ఒబామా' 'ఒబామా పర్యటన - సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకే' 'ఒబామా అసలైన తీవ్రవాది' అనే నినాదాలను ఇచ్చారు, బ్యానర్లను ప్రదర్శించారు.

## ఫీజుల పెంపుదలను నిరసిస్తూ విద్యార్థుల ఆందోళన

వేలాదిమంది ఆగ్రహావేశులైన యూనివర్శిటీ విద్యార్థులు మధ్యలండన్ నగరంలోని టోరీపార్టీ ప్రధాన కార్యాలయాన్ని చుట్టిముట్టి, రాళ్ళువిసిరి భవన అద్దాలను పగులగొట్టి, మండుతున్న వస్తువులను కార్యాలయంలోకి విసిరి ఫీజులపెంపుదలను, ఉన్నత విద్య కేటాయింపులలో కోతను నిరసిస్తూ కార్యక్రమం నిర్వహించారు. టోరీ కార్యాలయాలు వున్న మిల్‌బ్యాంక్ టవర్ ప్రాంతమంతా నినాదాలు చేస్తున్న ఆందోళన కారులతో నిండిపోయింది. అనేక మంది ఆ కార్యాలయ భవన పైకప్పు మీదకు ఎక్కారు. ఈ మధ్య కాలంలో జరిగిన అతిపెద్ద విద్యార్థుల ప్రదర్శన ఇది. దీనిలో 30 వేలమంది విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సాంప్రదాయక టోరీ పార్టీ ఆధ్వర్యంలోని సంకీర్ణ ప్రభుత్వంలో భాగస్తులైన లిబరల్-డెమోక్రాట్స్ కార్యాలయం ఎదుట కూడా మరొక నిరసన ప్రదర్శనను నిర్వహించారు.

## గ్రీసులో ప్రజా వ్యతిరేక ప్రభుత్వ విధానాలకు నిరసన

గ్రీసు కమ్యూనిస్టుపార్టీ ఇచ్చిన పిలుపు మేరకు గ్రీసులోని వివిధ పట్టణాలు, నగరాలలో నవంబర్ 15న నిరసన ప్రదర్శనలు జరిగాయి. గ్రీసు ప్రభుత్వం యూరోపియన్ యూనియన్ ప్రయోజనాలకనుగుణంగా అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వీరు నిరసించారు.

## కలరా వ్యాప్తికి హైతీలో నిరసన

ఐక్యరాజ్య సమితి శాంతి సేనలు తమ దేశంలో కలరా వ్యాపించటానికి కారుకులని ఆరోపిస్తూ, శాంతి సేనలకు వ్యతిరేకంగా హైతీ దేశవ్యాపితంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. గత శతాబ్ద కాలంలో తమ దేశంలో కలరా ఛాయలుకూడా లేవని, ఐ.రా.స. శాంతి సేనల రాకతో కలరా తమ దేశంలో ప్రవేశించి విస్తరిస్తున్నదని పేర్కొంటున్నారు. ఐ.రా.స. శాంతి సేనల వాహనాలను హైతీ రాజధాని పోర్ట్ ఆఫ్‌ప్రిన్స్ వద్ద నిలిపివేశారు. పోలీసులు భాష్పవాయువు ప్రయోగించారు. కలరా కారణంగా సుమారుగా 1900 మంది మరణించగా 84 వేల మంది ప్రజలు ఈ వ్యాధిబారిన పడ్డారు.

## నెదర్‌ల్యాండ్స్‌లో కళాకారుల నిరసన

1800 కోట్ల యూరోల పొదుపు చర్యలు చేపట్టడంలో భాగంగా నెదర్‌ల్యాండ్స్ ప్రభుత్వం- కళలు, సాంస్కృతిక విభాగానికి కేటాయించే నిధులలో కోత విధించింది. డచ్ ప్రభుత్వం ఇటీవలే వినోదపు టికెట్స్‌పై 6 నుండి 9 శాతం అమ్మకం పన్నును పెంపుదల చేస్తూ ఒక నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో దేశవ్యాపితంగా నిరసనలు సాగాయి. నవంబర్ 20న మధ్య ఆమ్‌స్టెర్‌డామ్ పట్టణంలో వేలాది మంది గాయకులు, సినిమా నటులు, టివి నటులు, కళాకారులు ఒక పెద్ద ప్రదర్శన నిర్వహించారు. విషాద గీతాలను ఆలపిస్తూ అభివృద్ధి నిరోధక ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. కళలు, సంస్కృతి అనేవి పేదలకు మృగ్యమైపోయాయని, అవికూడా ధనికులకు మాత్రమే అందే విలాస వస్తువులుగా మారిపోయాయని వారు పేర్కొన్నారు. T


# చేనేత వృత్తిరక్షణ కోసం, జీవించే హక్కు కోసం ఉద్యమిద్దాం! వరద, ముంపు బాధితుల, తక్షణ సహాయక చర్యల కోసం పోరాడుదాం!

# ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం (ఆం.ప్ర.), ఏ.పి.ఎఫ్.టి.యు.ల పిలుపు

మిత్రులారా!

వ్యవసాయం తరువాత అతిపెద్ద స్వయం ఉపాధి రంగమైన చేనేత నేడు తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నది. అనేక దశాబ్దాలుగా చేనేత కార్మికుల ఆత్మహత్యలు జరుగుతూనే వున్నాయి. గత 2 దశాబ్దాల కాలంగా ఇది మరింత తీవ్రమై, ప్రతి సంవత్సరం వందల సంఖ్యలో చేనేత కార్మికులు ఆకలి చావులకు, ఆత్మహత్యలకు బలౌతూనే ఉన్నారు. అధికారిక లెక్కల ప్రకారమే గత 10సం॥లలో 613 మంది (అనధికారికంగా ఎందరో....?) అందునా ప్రత్యేకించి గత ఆరేళ్లలోనే 452మంది కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారంటే చేనేత సంక్షోభం ఎంత తీవ్రంగా ఉన్నదీ స్పష్టమౌతూనే వుంది. అనేక దశాబ్దాలుగా కూలిగిట్టక, కడుపు నిండక చేనేత కార్మికులు ఆక్రోశిస్తున్నా, ఆకలి కేకలు వేస్తున్నా, ఆందోళనలు చేస్తున్నా, ఆఖరికి ఆ ఆకలిమంటలకే మలమలమాడి చచ్చిపోతున్నా, అప్పుల ఊబిలో నిండా మునిగిపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నా....పాలకులు (ఏ పార్టీ అధికారంలో ఉన్నా) కంటితుడుపు మాటలే తప్ప కనీస ఉపశమన చర్యలు కూడా చేపట్టకుండా దాటవేసి తమ బాధ్యతనుండి తప్పుకుంటున్నారు. ఫలితంగా చేనేతలో సంక్షోభం ప్రమాదకర స్థాయికి చేరింది. ఎంత వద్దనుకున్నా పదే పదే ఇదే ప్రశ్న పాలకుల ముందు నిలబడుతూనే వుంది. పాలకవర్గ పార్టీలు కూడా ఈ సమస్య గురించి మాట్లాడక తప్పని పరిస్థితి ఏర్పడింది.

## ఈ సంక్షోభానికి, కార్మికుల ఆత్మహత్యలకు కారకులు ఎవరు?

నాటి తెల్లపాలకులు కార్మికుల వ్రేళ్లు నరకడంతో చేనేతపై ప్రారంభించిన దాడిని ఆ తరువాత కాలంలో స్వదేశీ నల్లపాలకులు నిరాఘాటంగా కొన సాగిస్తున్నారు. ఆధునికత, అధిక ఉత్పత్తి ముసుగుతో ప్రారంభమైన జౌళి విధానం అంతిమంగా చేనేతకు జీవించే హక్కును ప్రశ్నార్థకం చేసింది.

గత 2 దశాబ్దాలుగా పాలకులు అమలు జరుపుతున్న విధానాలను పరిశీలిస్తే.......

- 1985లో రాజీవ్‌గాంధీ, అంతర్జాతీయ మార్కెట్ పోటీ పేరుతో ప్రవేశపెట్టిన "నూతన జౌళీ విధానం" చేనేతకు గొడ్డలి పెట్టుగా మారింది. మరమగ్గాల ప్రవేశం, మిల్లు ఉత్పత్తులు చేనేత వస్త్ర పరిశ్రమను దెబ్బతీశాయి. ఫలితంగా ఆ తరువాతి దశకంలో వందల సంఖ్యలో చేనేత కార్మికులు నేలరాలిపోయారు.

- దీనికి కొనసాగింపుగా పి.వి.నరసింహారావు పాలనలో స్వేచ్ఛా వాణిజ్యం పేరుతో 1991లో చేసుకున్న "గాట్ ఒప్పందం", "ప్రపంచబ్యాంకు విధానాల" అమలులో భాగంగా ఎయిర్‌జెట్, వాటర్‌జెట్ లూములను, కాంపోజిట్ (సమీకృత) మిల్లులను అనుమతించి, రాయితీలు ఇవ్వటం, ఆధునిక యంత్రాల వస్త్ర ఉత్పత్తులపై నియంత్రణను ఎత్తివేయటంతో చేనేతలో వ్యవస్థీకృత సంక్షోభం మరింత తీవ్రత దాల్చింది.

- వాజ్‌పేయ్ నేతృత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం తానేమీ తక్కువ తినలేదన్నట్లు ఏకంగా చేనేతకు మరణ శాసనమే లిఖించింది. సత్యం కమిటీ సిఫారసుల పేరుతో చేనేతకు ప్రాణాధారమైన చిలుపలనూలు (హ్యాంక్‌యార్న్) ను ప్రతిమిల్లు 50% విధిగా ఉత్పత్తి చేయాలనే నిబంధనను ఎత్తివేసి చిలుపలనూలు ఉత్పత్తికి గండి కొట్టింది. మిల్లు ఉత్పత్తికి అవసరమైన కోన్‌యార్న్ ఉత్పాదనపై నియంత్రణను ఎత్తివేసింది. దీంతో తీవ్రమైన నూలు కొరతను చేనేత పరిశ్రమ ఎదుర్కొంటోంది.

- రాష్ట్ర వ్యాప్తంగా సహకార స్పిన్నింగ్ మిల్లులను దివాళా బాటపట్టించి ప్రైవేటు యాజమాన్యాలకు కట్టబెట్టింది.

- చేనేతకు అవసరమైన ముడి సరుకులైన నూలు, జరీ, పట్టు (సిల్క్) ఉత్పత్తుల ధరలను ఇష్టానుసారం పెంచేశారు. పెంచుతున్నారు. ప్రస్తుత యుపిఏ హయాంలో గత 6 నెలల కాలంలో సుమారు 10 సార్లు నూలు ధరలు పెరిగాయి. పట్టుధర రెట్టింపయ్యింది. వీటితో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించే సుంకాలు, పన్నులతోపాటు రంగులు, రసాయనాల రేట్లను విపరీతంగా పెంచేస్తూ ఉండటంతో మొత్తంగా చేనేతకు అవసరమయ్యే ముడిసరుకుల ధరలు పెరిగిపోయాయి. క్షేత్రస్థాయిలో చేనేత బట్టల ఉత్పత్తికయ్యే ఖర్చు అనేక రెట్లు పెరిగిపోయింది. ఉత్పాదక వ్యయం పెరగటం కారణంగా, ధర పెరిగిన చేనేత బట్టకు ఆధునిక మిల్లు బట్టలను పోటీపెట్టి చేనేత ఉత్పత్తుల అమ్మకాలను దెబ్బకొట్టారు.

- చేనేతకు ఆరంభంలో కేటాయించిన 22 రకాల రిజర్వేషనును 11 రకాలకు కుదించి దానిని కూడా అతిక్రమించి ఈ 11 రకాలను మిల్లుల ద్వారా ఉత్పత్తి చేస్తూ, వాటినే చేనేత బట్టగా అమ్ముతున్న మిల్లు యజమానులపై పాలకులుగానీ, అధికార యంత్రాంగం గాని చర్యలు తీసుకోకపోగా ఉద్దేశ్యపూర్వక ప్రేక్షకపాత్ర వహించి చేనేతకు, దానిపై ఆధారపడ్డ 65 లక్షలమందికి ఆత్మహత్యలు, ఆకలిచావులే ప్రత్యామ్నాయంగా ప్రకటించింది.

- ప్రభుత్వం అనుమతించిన ఒక జెట్‌లూమ్ సగటున 50 నుండి 60మంది చేనేత కార్మికుల ఉపాధిని దెబ్బతీసింది. ఈ లెక్కన 50వేల మీటర్ల ఉత్పాదక సామర్థ్యం గల ఒక టెక్స్‌టైల్ మిల్లు (250 లూమ్‌లు) 10వేలమంది ఉపాధిని దెబ్బతీస్తుంది.

ఉదా: గుంటూరుజిల్లాలో 9,400 చేనేత మగ్గాలున్నాయి. అంటే ఒక్క మిల్లు, మొత్తం జిల్లాలోని చేనేత కార్మికులందరి ఉపాధిని దెబ్బతీస్తుంది.

ఈ మొత్తం పరిణామాలు, విధానాల ఫలితంగా చేనేతరంగం అవసాన దశకు చేరుకుంది. చేనేత కార్మికుల సంఖ్య వేగంగా తగ్గిపోతుందని, సగటున 1/3 వంతుమంది అంటే 65 లక్షల మందికి గానూ 22 లక్షలమంది వృత్తికి దూరమయ్యారని కేంద్రమంత్రి పనబాక లక్ష్మి స్వయంగా ప్రకటించవలసి వచ్చింది. క్షేత్రస్థాయిలో వీరి సంఖ్య మరింత ఎక్కువగా వుంది. వేగంగా పెరుగుతూనే వుంది.


(తరువాయి 5వ పేజీలో)

# దేశవ్యాపితంగా దళితులపై వివిధ రూపాల్లో కొనసాగుతున్న ఫ్యూడల్ దాడులు, దౌర్జన్యాలు

**మనదేశంలో** దళితులపై అగ్రకుల దురహంకారుల, భూస్వామ్య పెత్తందారుల హంతక దాడులు, దౌర్జన్యాలు, వేధింపులు, సాంఘిక బహిష్కరణలు నిత్యకృత్యమయ్యాయి. 'తెల్ల' వారిని ఈ దేశం నుండి తరిమివేసి స్వాతంత్ర్యాన్ని పొందామని చంకలు గుద్దుకుంటూ, దేశాన్ని అభివృద్ధి పథంలో పురోగమింపజేస్తున్నామని, దేశ ప్రజల జీవితాలను సమున్నతంగా తీర్చి దిద్దుతున్నామని పాలకులు చెప్పుకుంటున్నవన్నీ ప్రజలను మభ్యపరిచేందుకేనని వాస్తవాలను గమనిస్తే విదితమౌతుంది. ప్రపంచంలోనే ప్రశస్తమైన రాజ్యాంగాన్ని ఆమోదించుకున్నామని, ప్రజాస్వామ్య, లౌకిక, సమానత్వ ప్రాతిపదికన దేశప్రజల జీవితాలలో వెలుగులు నింపుతామన్న వాగ్దానాలన్నీ ప్రగల్భాలేనని వాస్తవాలు రుజువు చేస్తున్నాయి. పార్టీలు వేరైనా, జెండాలు ఏవైనా అధికారంలో కొనసాగిన, కొనసాగుతున్న పాలక పార్టీలన్నీ ఒకే తానులో గుడ్డలేననీ, వారి పాలనలో దళితుల, బలహీనవర్గాల, పేదప్రజల జీవితాలు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మిగిలి పోయాయనేది వెల్లడౌతున్నది. దేశంలో ఒకవైపు పెద్ద ఎత్తున శాస్త్ర ప్రయోగాలు, సాంకేతిక పరిశోధనలు విస్తృతంగా సాగిస్తున్నామని చెప్తున్నా ఈ కాలంలోనూ, మధ్యయుగాల నాటి అంధవిశ్వాసాలు, కుల దురహంకారాలు, ఫ్యూడల్ పెత్తనాలు, అణచివేత, దాడులు దేశం నలుచెరగులా విస్తరించుకొని సాగడం; దళితులపై, వెనుకబడిన కులాలపై దాడులు – అత్యాచారాలు, సాంఘిక బహిష్కరణలు భారత సమాజ అర్థఫ్యూడల్ స్వభావాన్ని చాటిచెప్తున్నాయి.

అగ్రకులాధిపత్యానికి వ్యతిరేకంగా అనేక పోరాటాలు నడిచిన తమిళనాడు రాష్ట్రం–కులుగుమలై జిల్లా, కె. వేలాయుధపురం గ్రామంలో నాలుగు సంవత్సరాల క్రితం దళిత కాలనీ చెందిన శుభ అనే ఓ యువతి అగ్రకుల పెత్తందార్ల అవమానాలను భరించలేక, వారిని ప్రతిఘటించే క్రమంలో ఆత్మహత్యకు పాల్పడింది. శుభ ఆత్మహత్య అనంతరం దళితుల్లో పెల్లుబికిన నిరసన, ఆందోళనల ఫలితంగా ఆమెను అవమానాలపాల్జేసిన అగ్రకులాల వారిపై పోలీసులు కేసు నమోదుచేశారు. దీనితో కక్షబూనిన గ్రామపెత్తందార్లు ఆనాటినుండీ ఆ దళిత కాలనీని సాంఘిక బహిష్కరణకు గురిచేశారు. అది ఈనాటికీ కొనసాగుతున్నది. దళితవాడను గ్రామం నుండి వేరుచేస్తూ ఒక కంచెను నిర్మించారు. అధికారులు దీనిని ఖండిస్తూ ఏవిధమైన చర్యలూ తీసుకోలేదు. దళితవాడకు ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని అధికారులు అకారణంగా నిరాకరించారు. అంతేకాదు, వీధిదీపాల సౌకర్యాన్ని నిలిపివేశారు. గ్రామీణ నిరుద్యోగ ఉపాధి హామీ పథకంక్రింద దళితవాడలో చేపట్టవలసిన పనులను చేపట్టకుండా, వారికి ఉపాధి కల్పించకుండా అధికారులను నియంత్రించారు. పెత్తందార్లపై కేసు నమోదుచేయటాన్నే ధిక్కారంగా భావిస్తూ, దళితులు దానినుండి వెనక్కు కాళ్ళబేరానికి వచ్చేందుకే ఈ సాంఘిక బహిష్కరణను గ్రామపెత్తందార్లు విధిస్తున్నారు. కాగా, ఈ పెత్తందారీ వర్గంతో కుమ్మక్కయిన ప్రభుత్వ, అధికార యంత్రాంగం దళితులపట్ల అణచివేతను అమలుచేస్తుండటాన్ని గమనించవచ్చు.

లక్నోకు దగ్గరలోని కొత్వాలీ ప్రాంతంలో జ్యోతీబా ఫూలే నగర్‌లోని ఒక వివాహిత మహిళపై ఆ గ్రామానికి చెందిన అగ్రకులస్థుడొకడు నవంబర్ 8న అత్యాచారానికి పాల్పడ్డాడు. ఇది వెలుగులోకి రావటంతో గ్రామపెద్దలకు పంచాయితీ నిర్వహించక తప్పలేదు. వాదోపవాదాల అనంతరం అత్యాచారం చేసిన విషయం స్పష్టమౌతుండటంతో, విషయం తమ చేయిదాటి పోనీయకుండా వుండేందుకు పంచాయితీ పెద్దలు పూనుకున్నారు. అత్యాచారానికి పాల్పడిన వాడిని వారే పదిమంది ముందూ తిట్టి, ఐదు చెప్పుదెబ్బలు కొట్టించారు. అంతటితో ఆ పంచాయితీ ముగించాలని భావించారు. బాధితులు ఈ నిర్ణయంతో సంతృప్తి చెందలేదని స్పష్టమై, వారిని పోలీస్ స్టేషన్‌కు వెళ్ళనీయ కుండా, ఫిర్యాదు చేయనీయకుండా పెత్తందారులు గ్రామంలోనే నిర్బంధించారు. పోలీసులకు ఫిర్యాదు చేయట మంటే అది తమ గ్రామ గౌరవ మర్యాదలను బజారుకీడ్చే విషయంగా పేర్కొంటున్నారు. గ్రామ గౌరవ మర్యాదలంటే అగ్రకులస్థుల గౌరవ మర్యాదలేననీ, దళితులకు గౌరవ మర్యాదలతో పనిలేదనీ చెప్పకనే చెపుతున్నారు. అగ్రకుల కోట గవాక్షాలవైపు దళితుడు కన్నెత్తిచూసిన నేరానికి దళితవాడను భస్మీపటలం చేస్తున్నవారు – మరోవైపున దళిత ఆడపడుచుపై తమకులస్థులు అత్యాచారానికి పాల్పడినా నోరువిప్పిచెప్పే స్వేచ్ఛకూడా లేదని వారిని కట్టడిచేస్తున్నారు!

బీహార్ రాష్ట్రం–ముజఫర్‌నగర్‌లోని మహబల్‌పూర్ గ్రామంలో 15 సం॥ వయసుగల 'నాజిమ్' అనే బాలుణ్ణి నవంబర్ 15వ తేదీన ఆ గ్రామ పెత్తందార్లు చెట్టుకు వేలాడదీసి మరీ కొట్టారు. ఇంతకూ అతను చేసిన నేరమేమంటే, అగ్రకులస్థులకు చెందిన చెరకు తోటనుండి గడ్డికోసుకోవటమే! ఈ 'ఘోరనేరానికి' పాల్పడినందుకు గానూ ఆ గ్రామ పెత్తందార్లు నాజిమ్‌పై ఇంతటి దుర్మార్గానికి ఒడిగట్టారు. ఆ బాలుని ఆర్తనాదాలను విని అక్కడికి చేరుకున్న గ్రామస్థులు మరికొందరు కలుగజేసుకోవటంతో ఆ బాలుడు ప్రాణప్రమాదంనుండి బయటపడగలిగాడు. ఈ నేరాన్ని పురస్కరించుకొని ఆ గ్రామానికి చెందిన సోంపాల్, ప్రమోద్‌కుమార్ అనే ఇరువురిపై పోలీసులు సెక్షన్ 307 క్రింద కేసు నమోదుచేశారు. అయితే పోలీసు యంత్రాంగం నమోదుచేసే ఈ కేసులనుండి ఏవిధంగా సురక్షితంగా బయట పడవచ్చుననే విషయం వీరికి వెన్నతోపెట్టిన విద్యే! అగ్రకుల పెత్తందార్లపై నమోదైన అరాకొరా కేసులన్నింటి అంతిమ ఫలితం ఎలా వుంటున్న దనేది మన కళ్ళముందు స్పష్టంగానే వుంది.

మన రాష్ట్రంలోని ఆదిలాబాద్‌జిల్లా, సింగాపురం గ్రామంలో దాదాపు 15 రజక కుటుంబాల్లోని 70 మంది స్త్రీపురుషులు చాకిరేవుపై ఆధారపడి జీవిస్తున్నారు. వీరంతా ఆ గ్రామంలోని అగ్రకుల పెత్తందారుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి జీవనాన్ని సాగించాల్సిన దుస్థితి నెదుర్కొంటున్నారు. ఒక ఇంట్లోవున్న కుటుంబ సభ్యులందరి బట్టలు నెలరోజులు వుతికితే వారికి లభించేది రూ.100 మాత్రమే. ఇది తమకేమాత్రం గిట్టుబాటు గావటం లేదనీ, ఈ వేతనాన్ని పెంపుచేయాలని అడగటమే అగ్రకులస్థుల దృష్టిలో నేరమైంది. ఊరిపెద్దలంతా కలసి ఈ రజక కుటుంబాలను 'వెలి' వేశారు. రజక కుటుంబాలకు ఎవరూ సాయంచేయరాదని, వారితో మాట్లాడరాదని, ఎవరూ ఇతర కూలీ పనులకు కూడా పిలవరాదనీ, వారికి షావుకార్లు సరుకులు విక్రయించ రాదనీ, ఈ కట్టుబాటును ధిక్కరిస్తే రూ. 5వేలు జరిమానా చెల్లించాల్సి వుంటుందని ఆదేశాలు జారీచేశారు. దీనితో ఆ రజక కుటుంబాల వారితో మాట్లాడేందుకు కూడా ఎవరూ సాహసించలేదు. గత్యంతరంలేని పరిస్థితుల్లో వారంతా గ్రామంలోని తమ ఇళ్ళకు తాళాలు వేసుకుని పొరుగువూళ్ళకు కూలీ పనులకోసం వెళ్ళివస్తున్నారు.

తాము దయతలచి విసిరిపడేస్తే తీసుకోవాలి మినహా తమనే వేతనం పెంచమని అడిగినందుకు గ్రామపెత్తందార్లు ఈ విధమైన క్రూరపద్ధతులనుసరిస్తూ ఇక ముందెవ్వరూ ఈ విధంగా ప్రశ్నించకుండానూ, ఈ రజకులకు 'బుద్ధి'వచ్చేట్లు చేసేందుకూ ఈ పద్ధతులను సరిస్తున్నామని 'సగర్వంగా' చాటుకుంటున్నారు!

మన రాష్ట్రంలోని చిత్తూరుజిల్లా, పెద్ద పంజాణి మండలం రాయలపేట గ్రామ పెత్తందారు చంద్రారెడ్డి అక్టోబర్ 29వ తేదీన క్షవరం చేయించుకునేందుకు మునిరత్నం అనే అతని క్షౌరశాలకు వెళ్ళాడు. ఆ సమయానికి మునిరత్నం లేకపోవటంతో వాకబుచేసే పేరిట చంద్రారెడ్డి ఆ ప్రక్కనే వున్న మునిరత్నం ఇంటికి వెళ్ళాడు. ఒంటరిగావున్న మునిరత్నం భార్య రెడ్డమ్మపై అత్యాచార ప్రయత్నంచేశాడు. ఆమె కేకలువేయటం, జనం గుమిగూడుతుండటంతో చంద్రారెడ్డి పరారయ్యాడు. మునిరత్నం ఈ విషయాన్ని చంద్రారెడ్డి భార్యకు ఫిర్యాదు చేసినా ఆమె వీరిపైనే ఎదురుదాడి చేస్తూ దుర్భాషలాడింది. ఆ ప్రాంత ఎం.పి.టి.సి.గా వున్న ఆమె, పెత్తందారీ వర్గస్వభావాన్ని సంతరించుకుని తోటి మహిళపై జరిగిన దౌర్జన్యంపట్ల సానుకూలంగా స్పందించకపోవటంతో బాధితులు సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో జరిగిన సంఘటనపై ఫిర్యాదుచేశారు. తమపై పోలీసులకు ఫిర్యాదు చేయటాన్ని చంద్రారెడ్డి వర్గపెత్తందారులు సహించలేక, మునిరత్నంతో సహా అతని బంధువులకు చెందిన ఐదు కుటుంబాలవారిని ఇంటిలో నుండి బయటకు రానీయ కుండా రెండురోజులు గృహనిర్బంధం చేశారు. వారి ఇళ్ళపై దాడులు చేశారు. దీనితో భయభ్రాంతులైన ఆ క్షౌర వృత్తిదారుల కుటుంబాలన్నీ తమ స్వగ్రామాన్ని వీడి పలమనేరులో తలదాచుకుంటున్నాయి.

చిత్తూరుజిల్లా నారాయణవనం మండలం కళ్యాణపురం గ్రామపెత్తందారైన మురళీ నాయుడివద్ద వెంకటేశ్ అనే అతను అప్పుతీసుకున్నాడు. నూటికి నాలుగు రూపాయల వడ్డీలెక్కన ప్రతినెలా వడ్డీ మొత్తం చెల్లిస్తూవస్తున్నాడు. కాగా, ఉన్నట్లుండి మురళీనాయుడు ఒక్కసారిగా తనవద్ద తీసుకున్న అప్పు అసలు, వడ్డీ మొత్తాన్ని చెల్లించమనటంతో వెంకటేష్ తాను ఆ విధంగా చెల్లించగల స్థితిలో లేనని చెప్పాడు. దీనికి ఆగ్రహించిన పెత్తందారు మురళీనాయుడు సెప్టెంబర్ 14వ తేదీన కుట్రపూరితంగా ఒక 'సీన్'ను సృష్టించి, తనపై వెంకటేష్ దాడికి పాల్పడ్డాడంటూ, అతన్ని ఊళ్ళో చెట్టుకుకట్టేసి అగ్రకుల పెత్తందారులంతా కలసి రాళ్ళతో, కర్రలతో కొట్టారు. ఈ సంఘటనను ఫోటోలు తీయకుండా విలేఖరులను అడ్డుకున్నారు. పైగా, బాకీ చెల్లించ మన్నందుకుగానూ తనపై హత్యాయత్నం చేశాడని వెంకటేష్ పైననే పోలీస్‌స్టేషన్‌లో పెత్తందారులు కేసు నమోదుచేయటం 'కొసమెరుపు'!

నెల్లూరుజిల్లా, నాయుడుపేట మండలం, చిల్లమత్తూరు గ్రామంలో పెత్తందార్లు పేదల తప్పులను ఎంచటం, జరిమానాలు విధించటం జరుగుతూవస్తున్నది. ఆ గ్రామంలో దళితులు కొందరు గ్రామపెత్తందార్లు విధించిన జరిమానాలను చెల్లించలేదని ఆ కుటుంబాలను పెత్తందార్లు సెప్టెంబర్ 9న సాంఘిక బహిష్కరణకు గురిచేశారు. వారి బంధువులైన దళిత కుటుంబాలతో సహా వూరిలో మరెవ్వరూ సాంఘికంగా వెలివేసిన వీరితో మాట్లాడరాదనీ, వారి నెవరినీ కూలీ పనులకు పిలువ రాదనీ, వారింట్లో శుభకార్యాలకు వెళ్ళరాదనీ ఈ నిబంధనలను అతిక్రమిస్తే రూ.500 జరిమానా చెల్లించటంతోపాటుగా శిక్షలకు గురవుతారని హుకుం జారీచేశారు.

శ్రీకాకుళం జిల్లా, గారమండలం శాలిహూండా గ్రామంలోని 191 కుటుంబాలలో 80 దళిత కుటుంబాలున్నాయి. దళితపేటకు ప్రక్కనేవున్న నాగావళి నదినుండి అనధికారికంగా పెద్దఎత్తున ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. దీనితో దళితుల భూములకు తీవ్ర నష్టం వాటిల్లుతున్నది. కనుక, ఇసుకను వేరే మార్గంలో తరలించుకోమని పెత్తందారులకు పలుమార్లు విజ్ఞప్తి చేశారు. వీరి విజ్ఞప్తులను పట్టించుకోకపోగా, దీనికి కక్షబూనిన పెత్తందారులు సెప్టెంబర్ 13న చుట్టుప్రక్కల గ్రామాలలోని వారి మద్దతుదార్లతో కలసి దాదాపు 200మంది ట్రాక్టర్లపైవచ్చి దళితులపై దాడికి పాల్పడ్డారు. అంతే గాక, ఆనాటి నుండీ దళితవాడకు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. కుళాయి పైపులు పగులగొట్టి మంచినీటి సౌకర్యం లేకుండా చేశారు. వ్యవసాయ తదితర కూలీపనులకు పిలవటం ఆపేశారు. నిత్యావసర వస్తువులను అమ్మకుండా గ్రామంలోని షావుకార్లను కట్టడిచేశారు.

గోవా రాష్ట్రంలోని పెర్నెమ్ తాలూకా మారుమూల పల్లె పొరాక్ సదన్‌లో శంభుకాలే అనే పూజారి–భార్య, ముగ్గురు పిల్లలతో నివశిస్తున్నాడు. శంభుకాలే ఆ గ్రామంలోని శ్రీమౌలి దేవస్థానంలో పూజారిగా వుంటూ వచ్చాడు. అక్టోబర్ 23వ తేదీన కొత్తగా పెళ్ళిచేసుకున్న ఒక దళిత జంటను గుడిలోకి రానివ్వటమేగాకుండా వారిని పూజారి ఆశీర్వదించి పంపటాన్ని అగ్రకుల గ్రామస్తులంతా భరించలేకపోయారు. వీరంతా ఏకమై పూజారి కుటుంబాన్నే వెలివేశారు. గ్రామాన్ని వీడి వెళ్ళాలని ఆదేశించారు. ఈ హఠాత్పరిణామంతో తట్టుకోలేక పూజారి భార్య ఆత్మహత్య చేసుకుంది. అయినా గ్రామ పెద్దల మనసు మారలేదు. గత్యంతరంలేని పరిస్థితులల్లో పూజారి–తన పిల్లలతోకలసి సమీప గ్రామంలో తలదాచు కుంటున్నాడు. దళితులకు ఆలయ ప్రవేశాన్ని నిషిద్ధం చేయటమేగాక, దళిత దంపతులకు ఆశీర్వచనాన్నివ్వ టాన్ని కూడా అగ్రకుల మనువాద పెత్తందార్లు సహించ లేకుండావున్నారనే విషయం స్పష్టమౌతున్నది.

## మూఢనమ్మకాల ముసుగులో దళితులపై దాడులు

దళితులపై దాడులకు ఫ్యూడల్ పెత్తందార్లు ఎప్పుడూ ఏదో ఒక సాకును సృష్టిస్తూనే వుంటారు. సినిమా హాల్లో దళితులు కాళ్ళు ఎదుటి సీట్లపై వుంచి అగ్రకులాల వారికి తాకించారనేది కావచ్చు, సిటీబస్సులో తాము నిలబడి వుంటే దళితులు కూర్చొని ప్రయాణిస్తున్నారనేది కావచ్చు, దళిత యువకులు అగ్రకుల అమ్మాయిలను కదిలించారనేది కావచ్చు....ఏదో ఒక సాకు చాలు దళితులపై దాడిచేయటానికి! ఈ కోవలోకి మూఢ నమ్మకాలు కూడా వచ్చిచేరాయి. అవిద్య, అజ్ఞానం అశాస్త్రీయ భావాలు మూర్తీభవించిన గ్రామాల్లో చేతబడి, బాణామతి, చిల్లంగి వంటి 'క్షుద్రవిద్య'లు హెచ్చుగా వున్నాయి. దీనిని తమకు అనుకూలంగా ఉపయోగించు కుంటున్న కొంతమంది పెత్తందార్లు, తమను ప్రశ్నించి, తమకు వ్యతిరేకంగా నిలిచినవారిపై ఈ క్షుద్రవిద్యలను సాకుగా ప్రయోగిస్తూ గ్రామంలో అరిష్టాలకు కారణాలవుతున్నారనే ప్రచారాన్ని కల్గిస్తున్నారు. గ్రామాల్లో జరిగే ప్రతి చెడుకూ వారిని అకారణంగా బాధ్యులను చేస్తూ మూఢనమ్మకాలతో నున్న ప్రజలఎదుట వారిని శత్రువుగా నిలబెట్టి, ప్రజలచేతనే వారిని అడ్డుతొలగించు కోవటమనేది ఒక విధానంగా సాగుతున్నది.

మన రాష్ట్ర రాజధానీ నగరానికి 40 కి॥మీ దూరంలోవున్న నేషనల్ హైవే ప్రక్కనేవున్న నల్గొండజిల్లా చౌటుప్పల్ మండలం ఖైతాపురం గ్రామంలో మూఢనమ్మకాల పేరిట సెప్టెంబర్ 15న గుద్దేటి ఎల్లయ్య, చిలువేరు నర్సయ్య అనే ఇద్దరు వృద్ధులను పెత్తందార్ల సమక్షంలోనే సజీవదహనం చేశారు. వాస్తవానికి, ఎల్లయ్య పొలాన్ని పెత్తందార్లు కారుచౌకగా కబ్జా చేయదలుచు కున్నారు. పెత్తందార్ల కన్నుబడిన తమ పొలాన్ని వారికి అమ్మటానికి నిరాకరించటమే ఈ వృద్ధులు చేసిన నేరం! తాము కొంటామంటే కూడా భూమిని అమ్మలేదనే అక్కసుతో గ్రామంలో జరిగే ప్రతి చెడుఘటనకూ వారినే బాధ్యులనుచేస్తూ, చేతబడి, బాణామతులను వారు ప్రయోగిస్తున్నారని ప్రచారంలో పెట్టి ప్రజలను నమ్మించారు. దీనితో గ్రామ ప్రజలే పూనుకొని ఆ దళితులను సజీవ దహనం చేశారు. ఈ ఘటనలో అరెస్టు అయిన 77 మందిలో ఎక్కువమంది దళిత, బలహీన వర్గాలకు చెందిన పేదవారే వున్నారంటే మనకంటిని మనవేలితోనే పొడిచే విధానాన్ని పెత్తందారులు ఏవిధంగా పాటిస్తున్నారో స్పష్టమౌతుంది.

నల్గొండజిల్లా నాంపల్లి మండలంలో జంగమ్మ అనే దళిత మహిళ పెత్తందార్ల మాట వినకుండా చిన్న ఇల్లుకట్టుకున్నందుకు మూఢనమ్మకాల పేరిట హత్యకు గురైంది.

పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరులో తమ ఇళ్ళమధ్య ఓ దళిత మహిళ ఇల్లుకట్టుకున్నదనే కారణంగా క్షుద్రవిద్యలను ఆపాదించి వివస్త్రనుచేసి కొట్టారు.

మెదక్‌జిల్లాలో భూతగాదాను పురస్కరించుకొని చేతబడులను ఆపాదించి ఓ వృద్ధదంపతులను చంపేశారు.

మహబూబ్‌నగర్‌జిల్లా బల్మూరుమండలం చెన్నారం గ్రామంలో దళితుడైన నిరంజన్ అనే 60 సం॥రాల వృద్ధుడిని అక్టోబర్ 16వ తేదీన పట్టపగలు గ్రామ నడిబొడ్డున వున్న పంచాయితీ కార్యాలయం ఎదుట నిలబెట్టి మూడుగంటలపాటు చిత్రహింసలకు గురిచేసి హత్యగావించారు. ఫ్యూడల్, పెత్తందారీతనం హెచ్చుగా వున్న ప్రాంతాల్లోనే ఈలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. అయితే ఈ సంఘటనలన్నింటి లోనూ దీనికి సూత్రధారులైన పెత్తందారులు మాత్రం సులభంగా తప్పుకోగలుగుతున్నారు. దళితులు ఆత్మగౌరవంకోసం ప్రయత్నించటం, తమను ప్రశ్నించటం, వ్యతిరేకించి నిలబడివుండటం అనే సందర్భాలన్నింటా ఫ్యూడల్ పెత్తందారులు చేతబడి, బాణామతివంటి వాటినికూడా ఆయుధాలుగా ఉపయోగించి అణచివేస్తున్నారు. మూఢనమ్మకాల నుపయోగించి దళితులపై, బలహీనవర్గాలపై సాగుతున్న దాడుల్లో అత్యధికభాగం ఆస్తి సంబంధ తగాదాలు, అగ్రకుల దురహంకారం కారణంగా జరుగుతున్నవేనని సామాజిక అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. ✡

---

**చేనేత...** (4వ పేజీ తరువాయి)

వీటికి తోడు ప్రకృతి వైపరీత్యాలైన తుఫానులు, వరదలు, ముంపుబారినపడి ప్రతియేటా చేనేత కార్మికులు నష్టపోతున్నా, శాశ్వత పరిష్కారం చూపాలని దశాబ్దాల కాలంగా కోరుతున్నా తాత్కాలిక ఉపశమనాల హామీలే తప్ప చర్యలు చేపట్టటం లేదు. శాశ్వత పరిష్కారం ఊసే లేదు.

గత అనేక దశాబ్దాలుగా బడా, బహుళజాతి కంపెనీల ప్రయోజనాలే ధ్యేయంగా అమలు జరిపిన జౌళీ విధానం అంతిమంగా పాలకులు కోరుకున్నట్లే చేనేతకు 'చితి'ని పేర్చిపెట్టాయి. ఫలితంగా వృత్తి అంతర్ధానమయ్యే స్థితి నెలకొంది. దీంతో కార్మికులు తాము జీవించే హక్కును కోల్పోవాల్సిన పరిస్థితి దాపురించింది. పాలకులు చెప్పే పరిహారాలు, పథకాలు, సహాయక చర్యలు కనీస ఓదార్పును కూడా ఇవ్వడం లేదు. వృత్తిరక్షణే శాశ్వత పరిష్కారం. ఆ లక్ష్య సాధన కోసం చేనేత కార్మికులంతా సంఘటితపడి ఉద్యమించాలి! ✡

# ప్రజాస్వామిక విలువలపై దాడిచేస్తున్న అర్ధఫాసిస్టు హిందూ దురహంకార రాజకీయ సంస్థలను కనిపెట్టి ఉండండి!

**మరాఠీల** సంస్కృతిని కాపాడే పేరుతో భావోద్వేగాలను రెచ్చగొట్టి వెలుగులోకి రావాలనే ఉన్మాద ప్రయత్నాలలో భాగంగా థాకరేలు భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. యువ పౌరులపై నైతిక సెన్సారు విధించే పేరుతో ఈ దురహంకారులు సృజనాత్మక, మేధో ఉత్పత్తులపైన క్రూరమైన దాడులు చేస్తున్నారు. రెచ్చగొట్టడానికి తగిన అంశాలు దొరక నప్పుడు వారి దాడులకు గతంలోకి వెళ్ళి కారణాలను చూపుతున్నారు. వారు ఉద్యోగాలను సృష్టించాలను కున్నప్పుడు పుస్తకాలు, సినిమాలు, చిత్రపటాలు, టి.వి., సినిమాలు, క్రికెట్ పోటీలకు వ్యతిరేకంగా హింసాయుతంగా ప్రదర్శనలు చేస్తున్నారు.

రోహింటన్ మిస్త్రీ అనే కెనడాలో స్థిరపడిన రచయిత 20 సంవత్సరాల క్రితం వ్రాసిన 'సచ్ ఎ లాంగ్ జర్నీ' అనే నవలకు వ్యతిరేకంగా హింసాయుతంగా ఉద్యమించారు. ఈ పుస్తకం చాలా సంవత్సరాలుగా ముంబాయి విశ్వవిద్యాలయం బి.ఎ. పాఠ్యాంశాలలో భాగంగా ఉన్నది. శివసేన నాయకుడు, బాల్‌థాకరే మనవడు, ఉద్ధవ్‌థాకరే కొడుకూ అయిన ఆదిత్యథాకరే రాజకీయరంగ ప్రవేశం సందర్భంగా ఈ నవలపై దాడులు జరిగాయి.

ఏనాడూ ఈ పుస్తకం చదవని అండర్-గ్రాడ్యుయేట్ అయిన ఆదిత్య నాయకత్వాన యువత, ఈ పుస్తకంలో ఎటువంటి నైతిక విలువలులేని భాషను ఉపయోగించారని ఆరోపిస్తున్నారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ముంబాయి 'డబ్బావాలా'లను గురించి ఈ పుస్తకంలో చౌకబారుగా, అసభ్యకరంగా వ్రాశారంటూ మరాఠీల భావోద్వేగాలను రెచ్చగొట్టి హింసాయుత ఆందోళనలను ప్రారంభించారు. తమ వేధింపులలో భాగంగా యూనివర్శిటీ క్యాంపస్‌లో ఆ పుస్తకాన్ని తగలబెట్టారు. ఆ పుస్తకాన్ని విశ్వ విద్యాలయాల పాఠ్యప్రణాళిక నుండి తొలగించాలని సంకుచిత మనస్కులైన శివసైనికులు డిమాండ్ చేశారు.

అలగా భావజాలంతో కూడిన ఒక సంస్థ చేసిన ఈ డిమాండ్‌ను, ఎటువంటి ఆలోచనా లేకుండా, సిగ్గులేకుండా, వైస్‌ఛాన్సలర్ ఆమోదించారు. విమర్శనాత్మక ఆలోచనను, సృజనాత్మకతను, ఉదారవాద విలువలను కాపాడవలసిన తన బాధ్యతను విస్మరించారు. ముంబాయి విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ చేసిన ఈ చర్య పిరికితనంతో చేసిందేమీకాదు. ఉనికిని కాపాడు కోవటంకోసం, అధికార వర్గాలను ఆకట్టుకొనే అవకాశవాదంతో కూడిన పతనానికి ఇది నిదర్శనం.

ఈ మరాఠీ మానవుల దుష్ప్రవర్తనను ఖండించ వలసిన ఆనాటి మహారాష్ట్ర ముఖ్యమంత్రి, ఆ పుస్తకంలో 'చెడ్డభాష' ఉపయోగించారని నిస్సిగ్గుగా ప్రకటించడం, వారి చర్యలను సమర్ధించటం ఆశ్చర్యకరమేమీకాదు. శివసేన మేధావులు, ముఖ్యంగా సామ్నా పత్రిక కార్యానిర్వాహక సంపాదకుడైన సంజయ్ రౌత్, కేంద్రంలోను, రాష్ట్రంలోను పాలక పార్టీగా ఉన్న కాంగ్రెస్ సహకారాన్ని పొందటానికి 'సచ్‌ఎలాంగ్‌జర్నీ'లో నాటి ప్రధానీ ఇందిరాగాంధీపై అసభ్యమైన విషయాలను వ్రాశారనీ శివసేనను దుర్భాషలాడారని ప్రచారం చేశాడు.

విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ తీసుకున్న తెలివైన నిర్ణయానికి శివసేన కృతజ్ఞతలు తెలియచేసింది. విద్యార్థులు, అధ్యాపకులు ఈ నిర్ణయంపట్ల నిరసనను ప్రకటించారు.

ఈ సందర్భంలో ఉదారవాద సాంఘిక విలువలు, లౌకిక విలువలు కాంగ్రెస్‌కు ఉన్నాయనే భ్రమలకు లోను కానవసరంలేదు. ఓట్ల రాజకీయాల వేదిక మీద లౌకిక భావజాలాన్ని కలిగినదిగాను, ఉదారవాద విలువలను కాపాడేదానిలాగా కాంగ్రెస్ ప్రవర్తిస్తున్నది.

మహారాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ శివసేన ఆదేశాలమేరకే పనిచేస్తూంటుంది. జేమ్స్.డబ్ల్యూ.లెయిన్ వ్రాసిన శివాజీ జీవితచరిత్ర అనే పుస్తకంపై నిషేధాన్ని సుప్రీంకోర్టు ఎత్తివేసినా పుస్తకాల షాపులనుండి ఆ పుస్తకాన్ని తొలగించాలని ఆదేశించింది. సోనియాగాంధీ జీవితం ఆధారంగా జేవియర్‌మోరో వ్రాసిన 'రెడ్‌శారీ' అనే పుస్తకాన్ని కూడా నిషేధించారు. సంకుచిత, సెమీఫాసిస్టు ధోరణులను ప్రదర్శించటంలో కాంగ్రెస్ పార్టీ-శివసేన, మహారాష్ట్ర నవ నిర్మాణ సేనలకు భిన్నమైనదేమీ కాదు.

మేధావులు, ఉదారవాదులు తీవ్ర నిరసన తరువాత రోహింటన్ మిస్త్రీ పుస్తకాన్ని పాఠ్యాంశాలలో చేర్చటానికి అంగీకరించారు. అదికూడా జేవియర్ యోరో రచించిన 'రెడ్‌శారీ'ని కూడా విశ్వవిద్యాలయ పాఠ్యాంశాలలో చేర్చితేనే అనే షరతుతో. ఓట్లుకొల్లగొట్టి అధికారాన్ని కైవసం చేసుకోవడానికి శివసేన, కాంగ్రెస్‌లు రెండుకూడా సమయానుకూలంగా సెన్సార్ షిప్ విధించడం, విధించక పోవడం అనేవి చేస్తున్నాయి.

ఈ పాఠ్య పుస్తకాన్ని ఉపసంహరించటంతో పొందిన విజయంతో మరింత ధైర్యంతో మరాఠీ దురహంకారులైన బాల్‌థాకరే, రాజ్‌థాకరేలు, పాకిస్థాన్ వరదబాధితులకు సాయం చెయ్యడానికి ప్రయత్నించిన షారూఖ్‌ఖాన్ సినిమాలను బహిష్కరించాలంటూ పిలుపునిచ్చారు. ఎప్పుడూ ప్రజల దృష్టిలో ఉండటానికి నిరంతరం అసహనాన్ని ప్రేరేపిస్తూ సంకుచిత ధోరణలతో రాజకీయ అధికారాన్ని పొందుటకు ప్రయత్నిస్తున్నారు.

భారతదేశంలో భాగంగా ఉండాలా, వద్దా అనే నిర్ణయాన్ని తీసుకునే అధికారం కాశ్మీరీలకు ఉన్నదని ప్రకటించిన అరుంధతీరాయ్‌కు గతంలో ఎం.ఎఫ్. హుస్సేన్‌కు చెప్పినట్లుగా ఒక గుణపాఠం చెప్పాలని హిందూమతోన్మాదులు బెదిరిస్తున్నారు. దేశంలో భావప్రకటనా స్వేచ్ఛ ఎలా ఉండాలో వారు నిర్దేశిస్తున్నారు.

భారత ప్రజల ఉదార ప్రవర్తనను, వారి ప్రతి అడుగునూ అడ్డుకునే విధంగా, ప్రజల ప్రతి కార్యక్రమంలోనికి ఈ హిందూ దురహంకార, ఉన్మాదభూతం ప్రవేశించింది. రాజకీయ అధికారం కోసం, పాలక వర్గాలు తమ దోపిడీని కొనసాగించు కోవడంకోసం, మతోన్మాదాన్ని ప్రజల జీవితాలలోనికి ప్రవేశించే వాతావరణాన్ని పాలకులు కల్పిస్తున్నారు.

భారతదేశ ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలను, ఉదారవాద విలువలను రక్షించే బాధ్యత ఈ దేశంలోని ఉదార, ప్రజాస్వామిక వాదులపై ఉన్నది, మతోన్మాదుల దాడులకు వ్యతిరేకంగా నిలకడైన ప్రజా ఉద్యమాలను నిర్మించవలసిన అవసరం ఉన్నది. T

# ప్రభుత్వ పొదుపు చర్యలకు వ్యతిరేకంగా యూరప్ ఖండంలో పెరుగుతున్న కార్మికుల నిరసనలు

**ఆర్థికమాంద్యం** కారణంగా యూరోపియన్ యూనియన్‌కు చెందిన దేశాలు తీవ్రరుణభారాలను, ఆర్థిక కొరతలను ఎదుర్కొంటున్నారు. ఈ ఆర్థిక సంక్షోభం నుండి బయటపడేందుకు అప్పులు మంజూరు చేస్తున్న అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ, యూరోపియన్ యూనియన్ అధికారులు, రెండు-మూడు సంవత్సరాల కాలంలో ఈ సంక్షోభం నుండి బయటపడే విధానాలను అమలు చేయమని వత్తిడి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ దేశాలన్నీ తమ ఆర్థిక సంక్షోభ భారాన్ని శ్రామిక ప్రజలపై రుద్దేందుకు ప్రయత్నిస్తున్న ఫలితంగా కార్మికులు ఈ విధానాలను ప్రతిఘటిస్తూ పోరాటాల్లోకి వస్తున్నారు. ప్రభుత్వాలు చేపడుతున్న పొదుపు చర్యలకు వ్యతిరేకంగా సాగుతున్న కార్మికుల ఆందోళనలు యూరప్‌లో, ప్రపంచదేశాలలో రోజురోజుకీ తీవ్రమౌతున్నాయి.

**ఉరుగ్వే** : తమ దేశ జి.డి.పిలో ఆరుశాతం నిధులను విద్యాబడ్జెట్‌కు కేటాయించాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 7వ తేదీన కార్మికులు ఉరుగ్వేలో 24 గంటల పాటు సమ్మె నిర్వహించారు.

**స్లొవేకియా** : స్లొవేకియా, బ్రటిస్లావాలోని ప్రధాన కూడలి అయిన యస్.ఎన్.పి. స్క్వేర్ వద్ద అక్టోబర్ 12వ తేదీన వేలాది మంది కార్మికులు సమీకృతులై ప్రభుత్వ పొదుపు చర్యలను నిరసించారు. అదేరోజు నిర్వహించిన 3 నిరవధిక కార్యక్రమాలలో ఇది ఒకటి. నిరసనకారులు పార్లమెంటు భవనంలోకి జొచ్చుకు పోయేందుకు ప్రయత్నించారు. కోసిక్, ఓలినాలలో ప్రాంతీయ నిరసన కార్యక్రమాలు జరిగాయి.

**రుమేనియా** : అక్టోబర్ 13న ఆర్థిక మంత్రిత్వశాఖ ఉద్యోగులు తమకు రావలసిన బోనస్ చెల్లింపుల రద్దును నిరసిస్తూ అప్పటికప్పుడు సమ్మె చేశారు. వందలాది వుద్యోగులు మంత్రిత్వశాఖ భవనాన్ని చుట్టుముట్టారు. తరగతులు ముగించుకున్న ఉపాధ్యాయులు ఆర్థిక మంత్రిత్వశాఖ ఉద్యోగుల సమ్మెకు మద్దతుగా విద్యామంత్రిత్వశాఖ కార్యాలయం వద్ద పికెటింగ్ నిర్వహించారు.

అక్టోబర్ 29న, ప్రభుత్వ పొదుపు చర్యలకు వ్యతిరేకంగా బుఖారెస్ట్ వద్ద మహాప్రదర్శన, ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేలాదిగా కార్మికులు, పెన్షనర్స్, నిరుద్యోగులు పాల్గొన్నారు. 'పెన్షన్ల రద్దును ఖండించాలి' 'వేతనాల కోతను ఎత్తివేయాలి' 'కార్మిక చట్టాల మార్పులను రద్దు చేయాలి' 'పెన్షన్ చెల్లింపుకు అర్హతవయస్సును పెంచవద్దని' ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.

**స్లోవేనియా** : అక్టోబర్ 18వ తేదీన రాజధాని జూబిలీజానాలో వందలాది మంది కార్మికులు పార్లమెంట్ భవనం ముందు సమీకృతులై ప్రభుత్వ 'సంస్కరణ'లకు, చిన్న ఉద్యోగాల చట్టానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు.

**ఇటలీ** : అక్టోబర్ 16న లోహ పరిశ్రమ మరియు అనేక ఇతర పరిశ్రమలకు చెందిన లక్షలాది మంది కార్మికులు, కార్మికుల హక్కులపై దాడిని ఎదుర్కొనేందుకు, కార్మికుల శ్రమను కారుచౌకగా దోపిడీ చేసుకొని సూపర్ లాభాలు గడించేదానిని నిరసిస్తూ సమావేశ మయ్యారు. 'ఫియట్' కంపెనీ యాజమాన్యం కార్మికులపై సాగిస్తున్న రాజ్యాంగ వ్యతిరేక, కార్మిక చట్ట వ్యతిరేక దాడులకు ఇటలీ ప్రభుత్వం మద్దతుగా నిలుస్తున్నది. తమ జీవనాధారాలను పోగొట్టుకోవటమో, తెగించి పోరాడటమో తేల్చుకోవలసిన స్థితిలో కార్మికులు వున్నారు. ఇటలీ రాజధాని రోమ్ నగరంలో కార్మికుల హక్కుల పరిరక్షణను డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున ప్రదర్శన నిర్వహించారు. నవంబర్ 27న సాధారణ సమ్మెకు వారు పిలుపునిచ్చారు.

**గ్రీసు** : అక్టోబర్ 14న సాంస్కృతిక మంత్రిత్వశాఖ ఉద్యోగులు పొదుపు చర్యలను నిరసిస్తూ గ్రీన్‌లోని జనసమ్మర్దమైన అక్రోపోలిస్‌ను దిగ్బంధనం చేశారు. పోలీసులు నిరసన కారులపై భాష్పవాయువును ప్రయోగించి ఈ దిగ్బంధాన్ని ఛేదించారు. కానీ దీనిని బేఖాతరు చేస్తూ నిరసన కారులు తమ ఆందోళనను కొనసాగించారు.

**పోర్చుగల్** : నవంబర్ 20న ట్రేడ్ యూనియన్లు సంయుక్తంగా ఒకరోజు సార్వత్రిక సమ్మె జరిగింది. 1988 తర్వాత ట్రేడ్ యూనియన్స్ నిర్వహించిన మొట్టమొదటి సంయుక్త సమ్మె ఇది. వేతనాల కోత, ఉద్యోగాల కోతలను వ్యతిరేకిస్తూ పెరుగుతున్న నిరుద్యోగాన్ని నిరసిస్తూ ప్రభుత్వ పొదుపు చర్యలను వ్యతిరేకిస్తూ ఈ సాధారణ సమ్మెను నిర్వహించారు.

**ఐర్లాండ్** : ఐర్లాండ్ రాజధాని డబ్లిన్‌లో పొదుపు చర్యలను వ్యతిరేకిస్తూ లక్షలాది మంది కార్మికులు తీవ్రమైన చలిని సైతం లెక్కచేయక నిరసన ప్రదర్శనను నిర్వహించారు.

**ఆస్ట్రియా** : వేలాదిమంది పెన్షనర్లు, కార్మికులు, విద్యార్థులు పొదుపు చర్యలకు వ్యతిరేకంగా వియన్నా ఛాన్సలర్ కార్యాలయం ఎదుట భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు.

**బ్రిటన్** : సామాజిక సంక్షేమ రంగంలో ప్రతిపాదించిన ఉద్యోగుల కోతకు వ్యతిరేకంగా వందలాది మంది కార్మికులు బ్రిటన్‌లో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఎడిన్‌బర్గ్‌లో జరిగిన నిరసన ప్రదర్శనలో 20వేలమంది కార్మికులు, ప్రజలు, కార్మిక కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు. లండన్‌లో మరొక భారీ నిరసన ధర్నా నిర్వహించారు. ఉత్తర ఐర్లాండ్‌లోని బెల్‌ఫాస్ట్‌లో వేలాదిమంది నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బ్రిస్టల్, కేంబ్రిడ్జి, డెల్లి, షెఫీల్డ్, మరియు ఇతర నగరాలలో కూడా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఉన్నత విద్యారంగంలో నిధులకోతను వ్యతిరేకిస్తూ, యూనివర్శిటీ ఫీజు పెంపుదలను వ్యతిరేకిస్తూ విద్యార్థులు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.

**ఫ్రాన్స్** : పెన్షన్లలో కోత విధించే చట్టానికి వ్యతిరేకంగా సమ్మెలు, నిరసన ధర్నాలు కొనసాగుతున్నాయి. ఫ్రెంచ్ ప్రభుత్వం చేసిన ఈ కార్మిక వ్యతిరేక చట్టాన్ని నిరసిస్తూ పెద్ద ఎత్తున విద్యార్థులు వీధుల్లోకి వచ్చి నిరసన కార్యక్రమాలుచేపట్టారు. రోడ్లపై బారికేడ్లు నిర్మించి వారు పోలీసులతో వీధి పోరాటాలు సాగిస్తున్నారు. పెన్షన్ దారుల అర్హత వయసును 60 సం॥ల నుండి 62 సం॥కు పెంపు చేయటాన్ని నిరసిస్తూ 10 లక్షల మంది ప్రజలు ఫ్రాన్స్‌లో నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 2010 సెప్టెంబర్ నుండి సాగుతున్న నిరసన కార్యక్రమాల్లో ఇది 8వ నిరసన ధర్నా. ప్యారిస్‌లో 90 వేల మంది ప్రజలు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఫ్రాన్స్‌లోని 18 విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యార్థులు ఈ నిరసన ధర్నాలలో పాల్గొన్నారు. చమురుశుద్ధి కర్మాగారాలకు చెందిన కార్మికులు పెన్షన్ సంస్కరణలకు వ్యతిరేకంగా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సమ్మెలను పోలీసు నిర్బంధంతో అణచి వేశారు. అయినా కార్మికులు పోరాటాన్ని కొనసాగించేందుకు సిద్ధంగా వున్నారు.

**ఫియట్ కార్మికులపై దాడులు** : అమెరికాకు చెందిన కార్ల కంపెనీ క్రిస్లర్‌ను చేజిక్కించుకున్న ఫియట్ గ్రూపు కంపెనీ పోలాండ్, సెర్బియా, టర్కీ మరియు బ్రెజిల్‌లలో తయారీ సౌకర్యాలను కలిగివుంది.

రెండు సం॥ల క్రితం క్రిస్లర్ గ్రూపు కంపెనీలను ఫియట్ చేజిక్కించుకొంది. ఒబామా మద్దతు, యు.డబ్ల్యూ.ఏ. నాయకత్వ సహకారంతో క్రిస్లర్‌యాజమాన్యం తన అనేక యూనిట్లను మూసివేసింది. నూతనంగా ప్రవేశించే ఉద్యోగులకు 50 శాతం జీతంలో కోత, అనేక సంవత్సరాల పాటు సమ్మెలపై నిషేధం విధింపుకు యు.డబ్ల్యూ.ఏ. అంగీకరించింది.

పోలండ్, 'టిచి' పరిశ్రమలో 6వేల మంది కార్మికులు 35 సం॥ల కొకసారి నూతనమైన కారును తయారుచేస్తారు. యూరప్‌లో అత్యధిక ఉత్పాదకత ఉన్న పరిశ్రమ ఇది.

నేపుల్స్ దగ్గరలోని పోమిగ్లియానో డిఆర్కో పరిశ్రమ జూన్‌లో చేసుకున్న కార్మికుల ఒప్పందంలో పనిగంటల పెంపు, తక్కువ విరామంతో పాటు సమ్మెలు లేకుండా చేసుకుంది. ఇప్పుడు ఫియట్ యాజమాన్యంకూడా కార్మికులనుండి అదే విధమైన రాయితీలు కోరుతూ, అమెరికాలోని, పోలాండ్ 'టిచి' కర్మాగారాలను పోలిన నూతన ఒప్పందాలు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నది. పని పరిస్థితుల్లో కోత విధించేందుకు, వేతనాలలో కోత విధించేందుకు పూనుకుంది. ఇప్పటికే దక్షిణ ఇటలీలోని ఈ పరిశ్రమయూనిట్ కార్మికులు నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటున్నారు. 48వేలమంది ఉద్యోగులను గత రెండు సంవత్సరాలుగా యాజమాన్యం బలవంతంగా 'కురచపనివారాల'కు అంగీకరింపజేసింది.

ఇప్పుడు ఈ నూతన ఒప్పందాన్ని అంగీకరించకుంటే ఇటలీలోని యావత్ పరిశ్రమలను మూసివేస్తానని యాజమాన్యం బెదిరిస్తున్నది. ఈ నూతన ఒప్పందం జాతీయకార్మిక విధానాలను నిరాకరిస్తున్నది. సమ్మెలను నిషేధించటం ఇటలీ రాజ్యాంగానికి విరుద్ధం.

ఈ నూతన ఒప్పందం శనివారాన్ని సాధారణ పనిదినంగా పేర్కొంటున్నది. (చట్టప్రకారం ఆరోజు వాస్తవానికి శలవుదినంగా వుండేది) సంవత్సరంలో 80 గంటల పాటు ప్రతికార్మికుడు తప్పనిసరిగా ఓవర్‌టైమ్ చేయాలని ఈ నూతన ఒప్పందం నిర్దేశిస్తున్నది-'సిక్‌లీవ్' ఆమోదించటం కష్టతరమై పోయింది. సమ్మెలను ఈ ఒప్పందం నిషిద్ధం చేస్తున్నది. లోహ పరిశ్రమకు చెందిన ఐదు యూనియన్లలో నాలుగు యూనియన్లు ఈ నూతన ఒప్పందాన్ని ఆమోదించాయి. మొత్తం సిబ్బంది యొక్క అభిప్రాయం తీసుకోగా 36 శాతం కార్మికులు నూతన కార్మిక ఒప్పందానికి విరుద్ధంగా ఓటువేశారు.

ప్రస్తుత ఆర్థిక మాంద్యం ఫలితంగా తలెత్తిన ఆర్థిక సంక్షోభాన్ని 'ఫియట్' పరిశ్రమ యాజమాన్యం ఉపయోగించుకొంటున్నది. +

Janasakti (Communist Revolutionaries'Fortnightly) RNI No.8315/63 VJ-077/2010-12

# గిట్టుబాటు ధరలు-ముంపు రైతాంగ సమస్యల పరిష్కారానికై రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) ఆధ్వర్యంలో
# వివిధ కేంద్రాలలో జరిగిన ఆందోళనా కార్యక్రమాలు

***గత*** *నాలుగు, ఐదు నెలలుగా వరుసగా, ఎడతెరపిలేకుండా కురుస్తున్న భారీ వర్షాల ఫలితంగా రాష్ట్రంలోని దాదాపు అన్ని జిల్లాలలో అతివృష్టి ముంపు కారణంగా అన్ని పంటలకూ తీవ్రమైన నష్టం జరిగింది. 'మూలిగే నక్కపై తాటిపండు పడినట్లు' ఇప్పటికే వ్యవసాయ ఖర్చులుభారమై రుణభారంలో కూరుకుపోయి, గిట్టుబాటు ధరలులేక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న రైతుకు ఈ అధిక వర్షాలు ఆశనిపాతంలా మారాయి. ఈ అన్ని భారాలకు తోడు కౌలుభారం కలగలవటంతో కౌలురైతులు దిక్కుతోచని స్థితినెదుర్కొంటున్నారు.*

*ఈ నేపథ్యంలో రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్) -గిట్టుబాటు ధరలు, ముంపు రైతాంగ సమస్యల పరిష్కారానికై* ***డిసెంబర్ 11వ తేదీన*** *రాష్ట్ర వ్యాపితంగా సమైక్య ఆందోళనలు చేపట్టమని పిలుపునిచ్చింది. రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర కార్యవర్గం డిమాండ్లతో కూడిన కరపత్రాన్ని ముద్రించి పంపిణీ చేసింది. ఈ పిలుపు మేరకు రాష్ట్రంలోని వివిధ కేంద్రాలలో జరిగిన ఆందోళనల రిపోర్టులు అందిస్తున్నాం.*

**- సంపాదకుడు**

## శ్రీకాకుళం:

రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) రాష్ట్ర పిలుపు మేరకు జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం పట్టణంలో జిల్లాలోని పలుప్రాంతాలనుండి హాజరైన 200మంది రైతు, కూలీలు ఏడురోడ్ల జంక్షన్ నుండి జెండాలు, బ్యానర్లతో, నినాదాలుచేస్తూ నవభారత్ జంక్షన్ చేరుకున్నారు. మూడురోడ్ల ప్రధానకూడలి అయిన ఆ ప్రాంతంలో దాదాపు గంటసేపు రహదారులను దిగ్బంధనం చేశారు. రాష్ట్ర కరపత్రాలను విస్తృతంగా పంపిణీ చేశారు. దాదాపు కిలోమీటర్ల పొడవునా వాహనాలు ఆగిపోయాయి. ఈ సందర్భంగా అక్కడ హాజరైన ప్రజలను, రైతుకూలీల నుద్దేశించి రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) రాష్ట్ర అధ్యక్షులు కా॥సింహాద్రి ఝాన్సి మాట్లాడుతూ తుపానులు, వాయుగుండాల కారణంగా రైతాంగం కోలుకోలేని విధంగా నష్టపోయిందని, ప్రకృతి వైపరీత్యంతోపాటు ప్రభుత్వం ముందుచూపుతో ప్రణాళికాబద్ధంగా రైతాంగాన్ని పరిస్థితులకు అనుగుణంగా సమాయత్తపరచక పోవడంవలన నష్టం మరింత పెరిగిందన్నారు. లక్షలాది ఎకరాలలో వేలాది టన్నుల ధాన్యం తడిసి మట్టిపాలైందని, పంట నీటమునిగి, మిగిలిన ధాన్యం రంగుమారి పోయిందని, తడిసిన ధాన్యాన్ని ఆరబెడితే ఒక్క గింజకూడా మిగలకుండా మొలకలు వస్తున్నాయని ఈ సందర్భంలో దెబ్బతిన్న పంటలన్నింటిని యుద్ధ ప్రాతిపదికన ప్రభుత్వ సంస్థలు కొనుగోలు కేంద్రాలు తెరచి నేరుగా రైతువద్దకే



శ్రీకాకుళంలో రాస్తారోకో

వెళ్ళి కొనుగోలుచేయాలని కామ్రేడ్ ఝాన్సి డిమాండ్ చేశారు. రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) శ్రీకాకుళంజిల్లా కార్యదర్శి కా॥తాండ్ర అరుణ మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో 1.60 లక్షల ఎకరాలలో పంట నష్టంజరిగిందని క్షేత్రస్థాయిలో పర్యటించి కలెక్టర్ ప్రకటించాడని, నష్టపోయిన వారందరికీ సత్వరమే పరిహారం అందజేయాలని డిమాండ్‌చేశారు.

ఈ కార్యక్రమంలో ఇంకా రైతుకూలీసంఘం జిల్లా అధ్యక్షులు కా॥బి.అచ్చెయ్య, జిల్లా నాయకులు మట్టా రమణ తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు. ప్రజాకళాకారులు ఈ సందర్భంగా రైతాంగ సమస్యలపై పాటలు పాడి, ప్రజలను ఆలోచింపజేశారు.

ఈ కార్యక్రమం మరునాడు 12-12-2010న రాష్ట్ర అధ్యక్షులు కా॥ఝాన్సీతోకూడిన ప్రతినిధి బృందం జిల్లా కలెక్టరును కలసి రైతాంగ డిమాండ్స్‌తో మెమోరాండం అందజేశారు.

## పార్వతీపురం:

అధిక వర్షాలు, అతివృష్టి కారణంగా నష్టపోయిన రైతులను తక్షణం ఆదుకోవాలని, రైతాంగ సమస్యలను వెనువెంటనే పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ స్థానిక గిరిజన రైతుకూలీ శ్రామిక నిలయంనుండి ఆర్.డి.ఓ. కార్యాలయం వరకు రైతుకూలీసంఘం ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శన, ఆందోళనా కార్యక్రమాల్లో జిల్లాలోని కొమరాడ, పార్వతీపురం, మక్కువ, సాలూరు తదితర మండలాలనుండి 300 మందికిపైగా గిరిజనులు, రైతు, కూలీలు పాల్గొన్నారు.

ఆర్‌డిఓ కార్యాలయానికి చేరేముందుగా ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద రైతాంగ సమస్యల పరిష్కారాన్ని డిమాండ్‌చేస్తూ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆగిపోయిన వాహనాలలోని ప్రజలకు రైతాంగ సమస్యలను వివరించే రాష్ట్ర కరపత్రాలను పంపిణీ చేశారు.

తదనంతరం ఆర్.డి.ఓ ఆఫీసువద్ద జరిగిన ధర్నా కార్యక్రమంలో రైతుకూలీసంఘం(ఆం.ప్ర.)జిల్లా కార్యదర్శి కా॥డి.వర్మ మాట్లాడుతూ మనదేశ మొత్తం ఆదాయంలో 70శాతం ప్రధానంగా వ్యవసాయరంగంనుండీ వస్తుందని, అయితే కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి రెండుశాతం నిధులు కూడా వెచ్చించటంలేదని, గత 20 ఏళ్ళలో రైతులకు జరిగిన రుణమాఫీ 57 వేలకోట్లు అయితే పారిశ్రామిక వేత్తలకు ఇళ్ళ రాయితీలు, రుణమాఫీలు 7 లక్షల కోట్ల రూపాయలనీ, ఈ రెంటినీ పరిశీలన చేస్తేనే పాలకుల రైతాంగ వ్యతిరేక విధానాల స్వభావం వెల్లడవుతుందనీ అన్నారు.

రైతుకూలీసంఘం జిల్లా అధ్యక్షులు కా॥ఊయక ముత్యాలు మాట్లాడుతూ ముంపుకు గురై నష్టపోయిన రైతులకు ఎకరాకు 15వేలు, అదనంగా కౌలురైతుకు 5 వేలు ఇవ్వాలని; ధాన్యానికి 1500, పత్తికి 5,000, చెరకు 2,500 రూ॥ గిట్టుబాటు ధరలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఇంకా ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కా॥బి.నర్సింగరావు, సహాయ కార్యదర్శి కా॥ఎం.భాస్కరరావు, కోశాధికారి కా॥పి.శ్రీను నాయుడులు పాల్గొన్నారు. ధర్నా అనంతరం ఆర్.డి.ఓ.కు మెమోరాండం అందజేశారు.

పశ్చిమగోదావరి జిల్లాలో **దేవీపట్నం, పోలవరం** కేంద్రాలలో ముంపు రైతాంగ సమస్యల పరిష్కారాన్ని డిమాండ్‌చేస్తూ ఆందోళనా కార్యక్రమాలను చేపట్టి నిర్వహించారు.

## బందరు:



బందరులో ధర్నా

ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలు తెరచి ధాన్యం కొనుగోలు చేయాలని, మధ్య తరహా, చిన్నతరహా మురుగు వ్యవస్థలన్నింటిని మరమ్మత్తులు చేసి, పునరుద్ధరించాలని డిమాండ్‌చేస్తూ రైతుకూలీసంఘం (ఆం.ప్ర) నాయకత్వంలో కలెక్టర్ కార్యాలయంవద్ద ధర్నా నిర్వహించారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) జిల్లా కార్యదర్శి కా॥ముప్పాళ్ళ భార్గవశ్రీ ఈ సందర్భంగా మాట్లాడుతూ అధిక వర్షాలకుతోడు, చేలల్లోని నీరు వెళ్ళిపోకపోవటానికి మురుగునీటి పారుదల వ్యవస్థ సక్రమంగా లేకపోవటమే కారణమనీ, ప్రభుత్వం సంస్థాగత రుణాలను రైతులకు అందించకపోవటం, పెట్టుబడులు పెరిగి రుణభారం తీవ్రంకావటం రైతులు ఆత్మహత్యలు చేసుకోవటానికి తక్షణ కారణాలవుతున్నాయన్నారు. ఆత్మహత్యలద్వారా సమస్యల పరిష్కారం సాధ్యంకాదని తెగించి సంఘటిత పోరాటాలు నిర్మించటమే సమస్య పరిష్కారానికి మార్గమని వివరించారు. మిల్లర్లు, దళారులు కుమ్మక్కై ధాన్యానికి కనీస మద్దతు ధర చెల్లించకుండా, అయిన కాడికి తెగనమ్ముకునే స్థితిని రైతులకు కల్పిస్తున్నారన్నారు. కౌలు రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం కనీసంగా సిద్ధంగా లేదన్నారు.

ఏపిఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ యద్దనపూడి సోని మాట్లాడుతూ బడా పారిశ్రామిక వేత్తలకు వేలాది, లక్షలాది కోట్ల నజరానాలనిచ్చే ప్రభుత్వం కష్టకాలంలో రైతాంగాన్ని ఎందుకు ఆదుకోదని నిలదియ్యాలన్నారు. మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేయబోమని భీష్మించు కుంటున్నారనీ ప్రభుత్వం గోడౌన్లు ఖాళీగా లేవని కొనుగోలు చేయలేమంటున్నదనీ, ప్రభుత్వ గోడౌన్లను కార్గిల్, ఐ.టి.సి.వంటి బహుళజాతి, బడా పరిశ్రమలకు ప్రభుత్వం అద్దెకు ఇచ్చివేసి ఖాళీలు లేవని చేతులెత్తి వేస్తున్నదని దీనిని అర్థంచేసుకొని పాలకుల దళారీ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించటం మినహా మరోమార్గంలేదని అన్నారు.

ఇంకా ఈ కార్యక్రమంలో రైతుకూలీసంఘం జిల్లా సహాయ కార్యదర్శి కా॥వీరబాబు, జిల్లా నాయకులు కా॥పామర్తి అంజమ్మ, కొప్పినేని ఉమా, ఈపూరి రాంబాబు; ఏపిఎఫ్‌టియు, ఎన్‌వైఎస్ తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఆర్‌డిఓకు మెమోరాండం ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో బందరు, చిన్నాపురం, చల్లపల్లి, నాగాయలంక, కంకిపాడు ప్రాంతాలనుండి ముంపు బాధిత రైతులు, కూలీలు, మహిళలు 150 మంది పాల్గొన్నారు. మెమోరాండం ఇచ్చిన అనంతరం కలెక్టర్ కార్యాలయంనుండి ప్రదర్శన బయలుదేరి లక్ష్మీటాకీస్ సెంటర్ చేరుకొని అక్కడే బైఠాయించి రాస్తారోకో జరిపారు. ప్రజా కళాకారులు రైతాంగ సమస్యలను వివరించే పాటలు పాడారు.

## చందర్లపాడు:

కృష్ణాజిల్లా చందర్లపాడులో రైతుకూలీసంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర పిలుపుమేరకు రైతాంగ సమస్యల పరిష్కారాన్ని డిమాండ్‌చేస్తూ ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ ధర్నా కార్యక్రమంలో రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర కార్యదర్శి కా॥కె.కోటయ్య పాల్గొని ప్రసంగిస్తూ తడిసిన ధాన్యాన్ని, పత్తిని ప్రభుత్వం వెంటనే ఎఫ్.సి.ఐ., సి.సి.ఐ.ల ద్వారా కొనుగోలు చేయించాలని, నాణ్యతా ప్రమాణాలు, నిబంధనలను ప్రక్కనబెట్టి



చందర్లపాడులో ధర్నా

అన్నిరకాల పంటలను ప్రభుత్వం కనీస మద్దతు ధరలకైనా కొనుగోలుతక్షణమే జరపాలని, పత్తికి క్వింటాకు రూ.5 వేలు; ధాన్యానికి క్వింటాలుకు రు.1500/- ఇవ్వాలని, దాళ్వా సాగుకు రుణాలు అందజేయటంతో పాటు, ఎరువులు, విత్తనాలు ఉచితంగా అందించాలని, రుణబకాయిలను మాఫీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ పాలకులు అధికార కుమ్ములాటలలో మునిగివున్నారని, లక్షల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని 2జి స్పెక్ట్రమ్, కామన్వెల్త్ క్రీడలు, ఆదర్శ గృహాలు తదితర అనేక కుంభకోణాల రూపంలో దిగమింగుతున్నారన్నారు. వీటిని గ్రహించిన రైతాంగం తమ సమస్యల పరిష్కారానికి పోరాటాలలోకి రావాలి మినహా ఆత్మహత్యలతో సమస్యలు పరిష్కారంకావని వివరించారు.

ఇంకా ఈ కార్యక్రమంలో సంఘంజిల్లా నాయకులు కామ్రేడ్స్ రాంబాబు, యాదల నాగేశ్వరరావు, స్త్రీవిముక్తి సంఘటన జిల్లా కన్వీనర్ కా॥కామేశ్వరి తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు. ఆ ధర్నా అనంతరం ప్రదర్శనగా వెళ్లి తహసిల్‌దార్‌కు మెమోరాండం అందించారు.

## రెంటచింతల:

గుంటూరుజిల్లా, మండల కేంద్రమైన రెంటచింతల గ్రామంలో రైతుకూలీసంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర పిలుపుమేరకు ఆందోళనా కార్యక్రమం చేపట్టారు. తొలుత మండలంలోని వివిధ గ్రామాలనుండి హాజరైన రైతు, కూలీలతో గంటకుపైగా మాచర్ల-గుంటూరు రాష్ట్ర హైవేపై బైఠాయించి రాస్తారోకో జరిపారు. ముంపు రైతాంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కరపత్రాలను ఈ సందర్భంగా విస్తృతంగా పంపిణీ చేశారు.

రాస్తారోకో అనంతరం గ్రామంలో ప్రదర్శన నిర్వహించి మండల తహశిల్‌దార్‌తో పాటుగా ఎండోమెంట్, వ్యవసాయశాఖ అధికారులకు విజ్ఞాపన పత్రాలను అందించారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) జిల్లా సహాయ కార్యదర్శి కా॥ పాటిబండ్ల కోటేశ్వరరావు ఈ సందర్భంగా హాజరైన రైతు, కూలీలనుద్దేశించి మాట్లాడుతూ రైతాంగ సమస్యల పరిష్కారానికి ఈ పాలకులు సుముఖంగా లేరని, స్విస్‌బ్యాంకులో దాచిన భారత ధనాఢ్యవర్గాలకు చెందిన 70 లక్షల కోట్ల రూపాయల డబ్బును ఈ దేశంలోకి తీసుకువస్తే భారత ప్రజల కష్టాలన్నింటినీ కడతేర్చవచ్చునని, ప్రభుత్వాలు అందుకు పూనుకోవనీ, ప్రజలే అందుకు సిద్ధంకావాలన్నారు.

ఈ కార్యక్రమంలో గ్రామంలో సీనియర్ కమ్యూనిస్టు కామ్రేడ్ సురభి అమరలింగం, పాలకుర్తి సత్తెయ్య, వాసు, సాములు, సామియేలు తదితరులు పాల్గొన్నారు.

తిరిగి 13-12-10న రైతుకూలీసంఘం ఆధ్వర్యంలో రెంటచింతలలో ప్రత్యేకించి కౌలురైతుల డిమాండ్లపై, కౌలు రైతులకే నేరుగా పరిహారం అందేవిధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఆందోళనా కార్యక్రమం చేపట్టారు. ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వం అందించే నష్టపరిహారం ఎటూ సరిపోవటం లేదనీ, అయితే కౌలు రైతులకు ఈ మేరకు కూడా పరిహారం అందటంలేదని, నష్టపోయిన కౌలురైతులకే నేరుగా పరిహారం అందే వైపుగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కా॥పాటిబండ్ల కోటేశ్వరరావు డిమాండ్‌చేశారు.

## కారంపూడి:

రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర పిలుపు మేరకు గుంటూరుజిల్లా మండల కేంద్రమైన కారంపూడిలో ప్రదర్శన, రాస్తారోకో కార్యక్రమాలను నిర్వహించారు. తొలుత స్థానిక సినిమాహాల్ కూడలి నుండి బయలుదేరిన

**(తరువాయి 7వ పేజీలో)**




కారంపూడిలో రాస్తారోకో

**Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010**
**and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2**
**Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010**